బుధవారం
18-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 88
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గాజా యుద్ధ లక్ష్యమదే: నెతన్యాహు

టెల్అవీవ్: లెబనాన్‌లో హెజ్బొల్లా దాడులతో తరలిన వారిని తిరిగి ఉత్తర ఇజ్రాయిల్‌కు చేర్చడమే గాజా యుద్ధ లక్ష్యమని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించారు. యుద్ధ లక్ష్యాలను మరింత విస్తరిస్తూ ఆయన ఈ ప్రకటన చేశారు. తాజా నిర్ణయానికి నెతాన్యహు భద్రతా కేబినెట్ ఆమోదించిందని ప్రధాని కార్యాలయం మంగళవారం తెలిపింది. గతేడాది అక్టోబరు 7న దక్షిణ ఇజ్రాయిల్‌పై హమాస్ దాడులు జరిపింది. ఆపై హెజ్బొల్లా రంగ ప్రవేశంతో ఇజ్రాయిల్-లెబనాన్ సరిహద్దు వద్ద పోరు తీవ్రరూపం దాల్చడం విదితమే.

ఆక్రమణలతోనే వరద ముప్పు

బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరు ప్రక్షాళన అవశ్యం

- ముంపు ప్రాంతాల రక్షణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే
- కొల్లేరు టు బుడమేరు పర్యటనలో నారాయణ, రామకృష్ణ

విశాలాంధ్ర కైకలూరు: ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం కైకలూరు, మండవల్లి మండలాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు పూర్తిగా ఫిష్ మాఫియా ఆక్రమణల్లో చిక్కుకుందని సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. కొల్లేరు అభయారణ్యం ఆక్రమణకు గురికావడంతో ఎగువ ప్రాంతాల్లోని పట్టణాలు ముంపు బారిన పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బుడమేరు, కొల్లేరు, ఉప్పుటేరుల్లో గల ఆక్రమణలు తొలగించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని స్పష్టంచేశారు. కొల్లేరు టు బుడమేరు పర్యటనలో భాగంగా పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి నుంచి బుడమేరు వరకు సీపీఐ, రైతుసంఘం ప్రతినిధి బృందం మంగళవారం పర్యటించింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, డ్రైన్లను పరిశీలించింది. ఈ సందర్భంగా కె.నారాయణ మాట్లాడుతూ ఆక్రమణలతోనే కొల్లేరు గ్రామాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. 1999లో కొల్లేరు సరస్సుగా 5వ కాంటూరు వరకు 77,138 ఎకరాలను అభయారణ్యంగా గుర్తించి ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేశారు. కొల్లేరు ఆపరేషన్ పేరుతో 2006లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లేరు అభయారణ్యంలో అడ్డగోలుగా తవ్వకాలు చేపట్టిన 25 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆక్రమిత చేపల చెరువులను ధ్వంసం చేసిందని, అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి సీపీఐ మద్దతు తెలిపిందన్నారు. వరదల సమయంలో బుడమేరు, రామిలేరు తమ్మిలేరు, చంద్రయ్య డ్రెయిన్, ఎర్రకాల్వ వంటి 67 డ్రెయిన్లు, కాల్వల ద్వారా కొల్లేరుకు లక్ష క్యూసెక్కుల నీరు చేరుతుందని, ఈ నీరంతా మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన నుండి కొల్లేరులోకి ప్రవహించి... ఉప్పుటేరు మీదుగా సముద్ర గర్భంలో కలుస్తుందని నారాయణ వివరించారు. ఆక్రమణ వల్ల ఎగువున ఉన్న పట్టణాలు, గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, దీనిని ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు.

కె.రామకృష్ణ మాట్లాడుతూ కొల్లేరును ప్రక్షాళన చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, అందుకోసం పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. ప్రకృతి విపత్తుల వల్ల ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాజాగా సంభవించిన భారీ వర్షాలు, వరదల వల్ల ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలు పూర్తిస్థాయిలో అతలాకుతలమయ్యాయని రామకృష్ణ చెప్పారు. బుడమేరు ఆక్రమణల వల్ల విజయవాడ బాగా నష్టపోయిందని, కొల్లేరు ఆక్రమణల వల్ల వేలాది ఎకరాల్లో

- మిగతా 2 లో

వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ

ముంపునకు గురైన ప్రతి ఇంటికి రూ.25వేలు

చిరు వ్యాపారులకు రూ.25వేలు, లఘు పరిశ్రమలకు లక్ష

పత్తికి రూ.25వేలు, అరటికి రూ.35వేలు

నష్టపరిహారం ప్రకటించిన సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఇటీవల కురిసిన భారీ వర్షాలు,వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు సీఎం చంద్రబాబు నష్టపరిహారం కింద ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు బాధితులకు అందజేసే పరిహార వివరాలను వెల్లడించారు. వంద రోజుల పాలనలో విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. వంద సంవత్సరాల చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదలు, బుడమేరుకు వచ్చిన వరదల కారణంగా ప్రజలకు భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.6,880 కోట్లుగా కేంద్రానికి నివేదిక అందజేసినప్పటికీ, వాస్తవస్థితి ప్రకారం నష్టం అంతకంటే ఎక్కువగానే వాటిల్లిందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశామని తెలిపారు. బాధితులకు ఆదుకునేందుకు అవసరమైన సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'భారీ వర్షాలు, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు కట్టించి ఇస్తామన్నారు. ప్రతి ఇంటికి రూ.25వేలు ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. మొదటి అంతస్తులో ఉండే వారికి రూ.10వేలు, ఇళ్లలోకి నీళ్లు వచ్చిన వారికి రూ.10వేలు, చిరు వ్యాపారులకు రూ.25వేల చొప్పున పరిహారం ఇస్తామన్నారు. ద్విచక్రవాహనదారులకు రూ.3వేలు, మూడు చక్రాల వాహనాలకు రూ.10 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఫిషింగ్ బోట్, నెట్ పాక్షికంగా దెబ్బతింటే రూ.9వేలు, పూర్తిగా నష్టపోతే రూ.20వేలు ఇస్తామన్నారు. సెరీ కల్చర్‌కు రూ.6వేలు. పశువులకు రూ.50వేలు. వరి ఎకరాకు

- మిగతా 2 లో

ఆసియా హాకీ చాంపియన్స్ ట్రోఫీ

విజేత టీమిండియా

హోరాహోరీ ఫైనల్‌లో చైనాపై 1-0 తో విజయం

బీజింగ్: హాకీ ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ-2024ని టీమిండియా కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆతిథ్య చైనాను 1-0 తేడాతో ఓడించింది. దీంతో ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీని వరుసగా రెండవసారి, మొత్తంగా ఐదవసారి భారత్ జట్టు గెలుచుకున్నట్లయింది. చైనాలోని హులున్‌బుయిర్‌లోని మోకీ ట్రైనింగ్ బేస్ వేదికగా మంగళ వారం ఫైనల్ మ్యాచ్ జరిగింది. హర్మన్‌ప్రీత్ సింగ్ నేతృత్వంలోని భారత్ జట్టు ఆద్యంతం అద్భుతంగా ఆడింది. మొదటి

- మిగతా 2 లో

గోధుమ పిండి ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ: ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ వైపు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అదే సమయంలో వంటనూనెల ధరలు పెరిగిపోయాయి. తాజాగా గోధుమ పిండి ధరలు సైతం పెరుగుతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. కొన్ని వారాలుగా గోధుమ పిండి ధరలు పెరుగుతూ వస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం గోధుమల సరఫరా తగ్గడమేనని తెలుస్తున్నది. హోల్‌సేల్ మార్కెట్‌లో పిండి ధరలు కనీసం 20 శాతం వరకు

- మిగతా 2 లో

రేపటి నుంచి టెట్ మాక్ టెస్టులు

22 నుంచి హాల్ టికెట్లు సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉపాధ్యాయ నియామకాల్లో కీలకంగా నిలిచే ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్)-2024 హాల్ టికెట్లను పాఠశాల విద్యాశాఖ సిద్ధం చేసింది. ఈ పరీక్షలకు నాలుగు లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. రాష్ట్రంలో కూటమి

- మిగతా 2 లో

దిల్లీ కొత్త సీఎం ఆతిశీ

- ఆప్ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక
- కేజ్రీవాల్ రాజీనామా

న్యూఢిల్లీ: రెండు రోజులుగా నెలకొన్న సందిగ్ధానికి తెరపడింది. దిల్లీ కొత్త సీఎం ఎవరో తేలిపోయింది. ఆ రాష్ట్ర మంత్రి ఆతిశీ మార్లీనా సింగ్ తదుపరి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడతారని ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు కేజ్రీవాల్ నివాసంలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ఆతిశీ పేరును కేజ్రీవాల్ ప్రతిపాదించగా ఎమ్మెల్యేలంతా మద్దతు ప్రకటించారు. కాగా దిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. సాయంత్రం గవర్నర్ వీకే సక్సేనాను కలిసిన కేజ్రీవాల్ తన రాజీనామా లేఖను సమర్పించారు. ఆమ్ ఆద్మీ పార్టీ శాసనసభాపక్షనేతగా ఆతిశీ ఎన్నికైనట్లు తెలిపారు. దిల్లీ ప్రయోజనాల దృష్ట్యా జైల్లో ఉన్నప్పుడు రాజీనామా చేయవద్దని కేజ్రీవాల్ భావించారని, అందుకే ఆయన బయటకు వచ్చాక రాజీనామా చేస్తున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ నేత, దిల్లీ మంత్రి గోపాల్ రాయ్ వెల్లడించారు. ఈ పరిణామాల క్రమంలో మరో వారం రోజుల్లో ఆతిశీ దిల్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసే అవకాశాలున్నాయి. షీలా దీక్షిత్ తర్వాత దిల్లీలో మహిళా సీఎంగా ఆతిశీ బాధ్యతలు స్వీకరించనున్నారు. దిల్లీకి మూడో మహిళా ముఖ్యమంత్రిగా ఆతిశీ విధులు నిర్వర్తించనున్నారు.

ఎన్నికలయ్యేంతవరకే: అతిశీ

దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేంత వరకు మాత్రమే తాను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుంటానని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించాక మళ్లీ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్

- మిగతా 2 లో

మంత్రులకు దడ!

- వంద రోజుల పనితీరుపై నివేదిక సిద్ధం
- నేడు మంత్రివర్గ భేటీలో వెల్లడించే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మంత్రుల్లో ఆందోళన నెలకొంది. ఎందుకంటే బుధవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో మంత్రుల పనితీరుపై ముఖ్యమంత్రి వివరాలు వెల్లడించనున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఈనెల 18వ తేదీ నాటికి 100 రోజులు పూర్తవుతోంది. ఈ వంద రోజుల్లో మంత్రుల పనితీరు ఎలా ఉంది ? శాఖలపై వారు పట్టు పెంచుకున్నారా ? సమర్థంగా పనిచేస్తున్నారా ? సకాలంలో శాఖాపరమైన సమీక్షలు నిర్వహిస్తున్నారా ? ఆయా శాఖల్లో జరిగే లోటుపాట్లపై తక్షణమే స్పందిస్తున్నారా ? ప్రభుత్వ విధానాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో వారి స్పందన ఎలా ఉంది ? అలాగే ప్రతిపక్షం చేసే విమర్శలను తిప్పికొట్టడంలో మంత్రుల వ్యవహార శైలి ఎలా ఉంటోంది ? తదితర అంశాలపై ముఖ్యమంత్రి ఇప్పటికే ప్రోగ్రెస్ రిపోర్టు సిద్ధం చేశారు. గత సమావేశంలోనే చంద్రబాబు మంత్రుల పనితీరుపై పాయింట్లు ఇస్తానని తెలిపారు. జనసేన పార్టీకి సంబంధించిన మంత్రుల పనితీరుపై ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు అందజేస్తానని తెలియజేశారు. పనితీరు సక్రమంగా లేకుంటే సరిచేసుకోవాలని, లేనిపక్షంలో చర్యలకు వెనుకాడబోమని కూడా చంద్రబాబు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం జరుగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశానికి హాజరుకానున్న మంత్రుల గుండెల్లో అలజడి

- మిగతా 2 లో

'బుల్డోజర్ న్యాయం' ఆపండి

- 1వరకు కూల్చివేతల నిలుపుదల
- సుప్రీం కోర్టు సంచలన తీర్పు

న్యూఢిల్లీ: ప్రభుత్వాలు 'బుల్డోజర్ న్యాయం' పేరుతో కూల్చివేతలకు పాల్పడటంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా అక్టోబర్ 1వ తేదీ వరకు బుల్డోజర్ చర్యల్ని నిలిపివేస్తూ 'స్టే' ఉత్తర్వులు జారీ చేసింది. బుల్డోజర్ న్యాయం పేరుతో నేర కార్యకలాపాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్న వారి ఇళ్లు, నిర్మాణాలను కూల్చివేయడాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు అనుమతి తీసుకున్న తరువాతే కూల్చివేతలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ కూల్చివేతలపై అక్టోబర్ 1వ తేదీ వరకు స్టే విధిస్తున్నామని... ఇదే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

స్టీలుప్లాంటును అమ్ముతాం!
మెడికల్ సీట్లు అమ్ముతాం!

మైన్మార్‌లో యాగీ బీభత్సం

2లో

గాజాను బతకనివ్వండి

గీత కార్మికులకు 10 శాతం షాపులు

- 1 నుంచి నూతన మద్య విధానం
- 6 రాష్ట్రాల్లో పరిశీలన తర్వాతే రూపకల్పన
- మంత్రివర్గ ఉపసంఘం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు అందించేలా కొత్త విధానం అక్టోబరు 1న అమల్లోకి రాబోతోందని మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. గీత కార్మికులకు 10శాతం మద్యం షాపులు కేటాయించేలా నూతన విధానాన్ని తెస్తున్నట్లు సభ్యులు కొల్లు రవీంద్ర, నాదెండ్ల మనోహర్, సత్య కుమార్ యాదవ్, కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. మంత్రివర్గ ఉప సంఘం భేటీ తర్వాత కొత్త విధానంపై సీఎం చంద్రబాబుకు సభ్యులు వివరించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా మద్య విధానాన్ని భ్రష్టు పట్టించారని విమర్శించారు. ఎక్సైజ్ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. సెబ్ పేరుతో వ్యవస్థను విధ్వంసం చేశారు. వారి అక్రమ మద్యం విధానాన్ని అమలు

- మిగతా 2 లో

జమ్మూకశ్మీర్ పోలింగ్ నేడు

బరిలో 219 మంది - తొలిసారి ఇల్తిజా ముఫ్తీ పోటీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. తొలిదశ పోలింగ్ బుధవారం జరగబోతోంది. అధికరణ 370 రద్దు తర్వాత జరగబోయే తొలి ఎన్నిక కావడంతో ఇది ఉత్కంఠ రేపుతోంది. తొలి దశలో ఏడు జిల్లాల్లోని 24 అసెంబ్లీ స్థానికులకు పోలింగ్ జరగనుంది. మొత్తం 219 మంది బరిలో నిలిచారు. 23,27,580 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్లలో 11,76,462 మంది పురుషులు, 11,51,058 మంది మహిళలు, 60 మంది థర్డ్ జెండర్ వారున్నారని ఈసీ తెలిపింది. పోలింగ్ కోసం అన్ని ఏర్పాటు చేశామని, 3,276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రకటించింది. 14వేల మంది సిబ్బందిని రంగంలోకి

- మిగతా 2 లో

మైన్మార్‌లో యాగీ బీభత్సం

226 మంది మృతి - 77 మంది గల్లంతు

నెపిడావ్: అంతర్యుద్ధంతో సతమతమవుతున్న మైన్మార్‌ను యాగీ తుపాను అస్తవ్యస్థం చేసింది. భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడి 226 మంది మృతి చెందారు. మరో 77 మంది గల్లంతు కాగా లక్షల మంది నిరాశ్రయులయ్యారు. బాధితులు 6.30 లక్షల మందికి పైగా ఉన్నారు. మృతుల సంఖ్య పెరగవచ్చని ఐక్యరాజ్య సమితి (ఐరాస) తెలిపింది. వర్షాలు, వరదలతో వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. రాజధాని నేపిడావ్ తీవ్రంగా ప్రభావితమైంది.

ఐదు లక్షల మంది ఆహారం, తాగునీరు, ఆశ్రయం లేక ఇబ్బంది పడుతున్నట్లు ఐరాస తెలిపింది. రోడ్లు కొట్టుకుపోగా మౌలికవసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగినట్లు పేర్కొంది. తమ దేశం కోసం విదేశీ సాయాన్ని అధికార జుంటా కోరుతోంది. కాగా వియత్నాం, థాయ్‌లాండ్, లావోస్‌నూ యాగీ తుపాను అతలాకుతలం చేసింది. వియత్నాంలో 300 మంది చనిపోయారు.

నేనొస్తే రష్యా, చైనాతో బంధం మెరుగు: ట్రంప్

వాషింగ్టన్: తాను అధికారంలోకి వస్తే రష్యా, చైనా దేశాలతో అమెరికా సంబంధాలు మెరుగవుతాయని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. నవంబరులో అధ్యక్ష ఎన్నికలు జరగనున్న క్రమంలో రిపబ్లికన్ పార్టీ తరపున ఆయన ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. గెలుపుపై ధీమాగా ఉన్నారు. 'ఎన్నికల్లో నేను గెలిస్తే మాస్కో, బీజింగ్‌తో వాషింగ్టన్‌కు సంబంధాలు మెరుగ్గా ఉంటాయి. వారు శత్రువులని అనుకోను. ఉక్రెయిన్ విషయంలో రష్యా రాజీని కోరుకుంటున్నా' అని బ్లాగర్ ఫరూక్ సర్మద్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. ఇదిలావుంటే ఉక్రెయిన్‌తో ఘర్షణ విషయంలో డొనాల్డ్ ట్రంప్‌ను మధ్యవర్తిగా పరిగణించేందుకు ఇది సమయం కాదని, అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిసేంత వరకు వేచి చూడటం మంచిదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ అభిప్రాయపడ్డారు. మరోవైపు తనపై హత్యాయత్నానికి ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్, అధ్యక్ష పదవికి ప్రత్యర్థి కమలా హారిస్ కారణమని ట్రంప్ ఆరోపించారు. డెమొక్రాట్ల రెచ్చగొట్టే మాటలే తనపై హత్యాయత్నాలకు దారితీసినట్లు వ్యాఖ్యానించారు. ఈ ఆరోపణలను బైడెన్, హారిస్ తోసిపుచ్చారు.

గాజాను బతకనివ్వండి

దాడులు ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేవాలి: అమెరికాకు చైనా సూచన



ఐరాస: గాజాను బతకనివ్వండి అంటూ చైనా ఉద్ఘాటించింది. దీర్ఘకాలంగా దీన పరిస్థితులను అనుభవిస్తున్న పలస్తీనా పౌరులకు జీవించే అవకాశమివ్వాలంటూ ఐక్యరాజ్య సమితి వేదికగా అమెరికా, ఇజ్రాయిల్‌కు విజ్ఞప్తి చేసింది. గాజా స్ట్రిప్‌లో సైనిక చర్యలను తక్షణమే నిలిపివేసేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తేచ్చేలా ప్రత్యక్ష చర్యలకు మరో క్షణం ఆలస్యం చేయొద్దంటూ అమెరికాను చైనా రాయబారి కోరారు. అమెరికా ఇందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఇజ్రాయిల్‌ను ప్రభావితం చేయాలన్నారు. ఐరాస తీర్మానాలకు కట్టుబడేలా చూడాలన్నారు. దీర్ఘకాలంగా అష్టకష్టాలు పడుతున్న పలస్తీనా ప్రజలకు జీవించే అవకాశం ఇవ్వాలని ఐక్యరాజ్య సమితికి చైనా సహాయక శాశ్వత ప్రతినిధి గెంగ్ షుయాంగ్ అన్నారు. పశ్చిమాసియా పరిస్థితిపై ఐరాస భద్రతా మండలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంవత్సర కాలంలో అంతర్జాతీయ స్థాయి సంయుక్త పిలుపులను బేఖాతరు చేస్తూ గాజాపై దురాక్రమణకు ఇజ్రాయిల్ పాల్పడుతోందని, మారణహోమం సృష్టిస్తోందని దుయ్యబట్టారు. 41వేల మందికిపైగా పలస్తీనియన్లు ఇప్పటికే ప్రాణాలు కోల్పోయరని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితి అత్యంత ప్రమాదకరమని అన్నారు. మానవతా విపత్తును నివారించేందుకు, ప్రాదేశిక శాంతిని నెలకొల్పేందుకు యుద్ధాన్ని ముగించేందుకు భద్రతా మండలి తీసుకునే అన్ని చర్యలకు చైనా సంపూర్ణ మద్దతు ఉంటుందని గెంగ్ షుయాంగ్ తెలిపారు.

గోధుమ పిండి ధరలకు రెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

పెరిగాయి. ధరల నుంచి ఊరట కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గోధుమల నిల్వ పరిమితిని సవరించింది. దసరా, దీపావళి పండగలకు ముందు పిండి ధరల పెరుగుదల సామాన్యులకు కష్టాలు పెంచుతున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో పిండి ధర క్వింటాల్‌కి రూ.2250 నుంచి రూ.2800 వరకు పెరిగింది. పిండి ధర పెరుగుదలతో బ్రెడ్, మఫిన్స్, నూడిల్స్, పాస్తా, బిస్కెట్లు, కేక్, కుకీలు తదితర ఉత్పత్తుల ధరలపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పిండి ధరల పెరుగుదల నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. దేశవ్యాప్తంగా గోధుమల నిలువలు సరిపడా ఉన్నాయని పేర్కొంది. అతే కాకుండా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని వ్యాపారులు, టోకు వ్యాపారులు, చిల్లర వ్యాపారులు, చైన్ రిటైలర్లు, ప్రాసెసర్స్‌కు వర్తించే గోధుమల స్టాక్ పరిమితిని సవరించింది. 2024 రబీలో 1129 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలు సేకరించారు. గోధుమ నిల్వ పరిమితి పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం గోధుమలను నిల్వ చేసే సంస్థలను కోరింది. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని పేర్కొంది. ఆయా స్టాక్ వివరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన అధికారులు పర్యవేక్షించనున్నారు.

దిల్లీ కొత్త సీఎం ఆతిశీ

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యతలు చేపడతారని ఆతిశీ అన్నారు. తదుపరి దిల్లీ సీఎంగా ఎంపికైన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... తాను ఇతర పార్టీల్లో ఉన్నట్లయితే కనీసం టికెట్ కూడా దక్కకపోయేదన్నారు. కానీ కేజ్రీవాల్ తనకు టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేను చేసి, ఆ తర్వాత మంత్రిని చేసి, ఇప్పుడు ముఖ్యమంత్రిని చేశారని వెల్లడించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు కేజ్రీవాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించారన్నారు. ఇలాంటి అవకాశం కేవలం ఆమ్ ఆద్మీ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు ఈ అవకాశం కల్పించారని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడం తనకు ఎంతో బాధ కలిగించిందన్నారు. తాను ముఖ్యమంత్రి పదవి చేపట్టానని అభినందించవద్దని, పూలమాలలు అవసరం లేదని సూచించారు. ఎన్నికల తర్వాత మళ్లీ కేజ్రీవాల్ సీఎం అవుతారన్నారు. మద్యం విధానం కేసులో తప్పుడు ఆరోపణలతో కేజ్రీవాల్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. కేజ్రీవాల్ అరెస్ట్ అక్రమం అని, సుప్రీంకోర్టు తీర్పు కేంద్రంలోని బీజేపీకి, దర్యాప్తు సంస్థలకు చెంపపెట్టు అన్నారు. కేజ్రీవాల్ స్థానంలో మరొకరు ఉంటే పదవిని వదులుకునే వారు కాదన్నారు. 'నేను ఈ బాధ్యత తీసుకున్నంత కాలం నా లక్ష్యం ఒక్కటే. దిల్లీ ప్రజలను రక్షించడానికి అరవింద్ కేజ్రీవాల్ మార్గదర్శకత్వంలో ప్రభుత్వాని నడపడానికి ప్రయత్నిస్తాను' అని ఆతిశీ అన్నారు.

సునీతా కేజ్రీవాల్‌కు ఆసక్తిలేదు: సౌరభ్ భరద్వాజ్

అంతకుముందు దిల్లీ కొత్త ముఖ్యమంత్రి ఎంపిక చేసే విషయంపై ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ మాట్లాడారు. మంత్రి మండలి నుంచి ఎవరో ఒకరు సీఎం అయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. అరవింద్ కేజ్రీవాల్ రాజకీయాల గురించి తనకు తెలిసినంతవరకు సునీతా కేజ్రీవాల్ సీఎం అయ్యే అవకాశం లేదని చెప్పారు. ఆమెకు ఆసక్తి లేదన్నారు.

ప్రమాణ స్వీకారం అప్పుడేనా?

సెప్టెంబరు 26-27 తేదీల్లో దిల్లీ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఆ సమయంలోనే ఆతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నట్లు ఆప్ వర్గాలు వెల్లడించాయి. ఈసారి ఉప ముఖ్యమంత్రిగా ఎవరినీ ప్రకటించే అవకాశాలు లేవని తెలుస్తోంది. మద్యం విధానం కేసులో ఈడీ విచారణ ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌కు సుప్రీం కోర్టు గత శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఆదివారం పార్టీ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించిన కేజ్రీవాల్ 2 రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని సంచలన ప్రకటన చేశారు. న్యాయస్థానం నుంచి న్యాయం దక్కిందనీ, ప్రజల నుంచి న్యాయం జరగాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ప్రజలు తమను నిజాయతీ పరులుగా అంగీకరించేవరకు సీఎం సీటులో కూర్చోబోనని కేజ్రీవాల్ చెప్పారు. దిల్లీ అసెంబ్లీకి వచ్చే ఏడాదిలో ఫిబ్రవరిలో ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే మహారాష్ట్రతో కలిపి వచ్చే నవంబరులోనే దిల్లీకి ఎన్నికలు జరపాలని కేజ్రీవాల్ డిమాండ్ చేస్తున్నారు.

'బుల్డోజర్ న్యాయం' ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో ఆక్రమణలు, అనధికారిక నిర్మాణాలను కూల్చివేయడానికి ఇలాంటి అనుమతులేవీ అవసరం లేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. అక్టోబర్ 1వ తేదీ వరకు తమ ఆదేశాలు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. 'తదుపరి తేదీ వరకు కోర్టు అనుమతి తీసుకోకుండా కూల్చివేతలు చేపట్టకూడదు. అయితే, బహిరంగ వీధులు, ఫుట్‌పాత్‌లు, రైల్వే లైన్‌లు, బహిరంగ ప్రదేశాల్లో అనధికారిక నిర్మాణాలకు ఈ ఆర్డర్ వర్తించదు' అని కోర్టు స్పష్టం చేసింది. చట్టపరమైన, శిక్షార్హమైన చర్యల్లో నేరారోపణలు ఎదుర్కొంటున్న నిందితుల ఇళ్లను, దుకాణాలను బుల్డోజింగ్ చేయకుండా నిరోధించాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టులో రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. మునుపటి విచారణలో అత్యున్నత న్యాయస్థానం ఈ బుల్డోజర్ జస్టిస్‌ను తీవ్రంగా తప్పుబట్టింది. దేశ వ్యాప్తంగా కూల్చివేతలపై మార్గదర్శకాలు అవసరం అని పేర్కొంది. కాగా, సుప్రీంకోర్టు తీర్పును యూపీ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియా తుషార్ మెహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కూల్చివేతలు చట్టవిరుద్ధమని... ఒక సామాజికవర్గాన్నే లక్ష్యంగా చేసుకుని కూల్చివేతలు చేపడుతున్నారనే వాదన పూర్తిగా అవాస్తవం అన్నారు. ఈ వాదనలు కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు కూల్చిన వాటిలో ఏది అసంబద్ధంగా కూల్చివేశారో ఒక ఉదాహరణ ఇవ్వాలని, అసలు కారణాన్ని తాము వెల్లడిస్తామని మెహతా అన్నారు. చట్టవిరుద్ధమైన నిర్మాణాలకు నోటీసులు ఇచ్చిన తరువాతే కూల్చివేతలు జరుగుతున్నాయని సొలిసిటర్ జనరల్ స్పష్టం చేవారు. మరోవైపు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు సీయూ సింగ్, ఎంఆర్ శంషాద్.. ఎస్‌జీ వాదనలను ఖండించారు. అక్రమ కూల్చివేతలు కొనసాగుతున్నాయని, సమస్య తీవ్రంగా ఉందని కోర్టుకు తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తదుపరి విచారణను అక్టోబర్ 1వ తేదీకి వాయిదా వేసింది.

ఆక్రమణలతోనే వరద ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పంట, ఆక్వా ఉత్పత్తులు దెబ్బతిన్నాయని చెప్పారు. అందువల్ల కొల్లేరు, బుడమేరును కాపాడాలని, జీఓ నెం.120లో పేర్కొన్న విధంగా 77,136 ఎకరాలతో కూడిన కొల్లేరు అభయారణ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ దిల్లీ వెళ్లి కేంద్రానికి వివరిస్తామని, ఆక్రమణలపై ఐక్యరాజ్యసమితికి కూడా ఫిర్యాదు చేస్తామని రామకృష్ణ తెలిపారు. చేపల రైతులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై కొల్లేరును దోచుకుంటున్నారని విమర్శించారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొల్లేరు ప్రపంచ గుర్తింపు పొందిన అద్భుతమైన మంచినీటి సరస్సు అని, అది వందలాది పక్షులకు నిలయమని, అయితే, ఆక్రమణల కారణంగా కొల్లేరు సరస్సు కుంచించుకుపోతోందని విమర్శించారు. కొల్లేరును 5వ కాంటూరు వరకు కాపాడాలని, అలా చేయడం వల్ల పక్షుల ఆవాసాలకు కేంద్రంగా ఉంటుందన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు కొల్లేరు మీదుగా ఉప్పుటేరు ముఖద్వారం నుంచి దిగువన ఉన్న బంగాళాఖాతంలో కలుస్తుందని, అయితే, ఆక్రమణల వల్ల కొల్లేరు లంక గ్రామాలు, పంటలు, చెరువులు ముంపుబారిన పడుతున్నాయని వివరించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా చేపల మాఫియా ప్రభావానికి గురవుతున్నాయని ఆరోపించారు. కొల్లేరును పరిరక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, ఉపద్రవాల నుంచి కొల్లేరును కాపాడాలని డిమాండ్ చేశారు. పంట, ఆస్తినష్టం లేకుండా చూడాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ కౌలు

రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు, రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంతా కృష్ణ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబా, కారం దారయ్య, మైసాక్షి వెంకటాచారి, జేవీ రమణరాజు, కంచర్ల గురవయ్య, ఉప్పలూరి హేమశంకర్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి పుట్టి రాయప్ప, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరకా శ్యామల, మన్నవ యామిని తదితరులు పాల్గొన్నారు.

విజేత టీమిండియా

(మొదటిపేజీ తరువాయి)

మూడు క్వార్టర్స్‌లో గోల్ సాధించేందుకు భారత ఆటగాళ్లు చేసిన ప్రయత్నాలను చైనా గోల్ కీపర్ వాంగ్ ఫీల్డ్ అడ్డుకున్నాడు. భారత ఆటగాళ్లు చక్కటి ఎత్తుగడలతో దూకుడుగా ఆడినప్పటికీ అన్నింటినీ నిలువరించాడు. పెనాల్టీ కార్నర్లను సైతం వాంగ్ ఫీల్డ్ విజయవంతంగా అడ్డుకున్నాడు. అయితే ఆఖరిదైన చివరి క్వార్టర్‌లో భారత ఆటగాళ్లు ప్రణాళికాబద్ధంగా ఆడి గోల్ సాధించారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ బంతిని అద్భుత రీతిలో డిఫెండర్ జుగ్‌రాజ్‌కి అందించాడు. దీంతో జుగ్‌రాజ్ అదిరిపోయే స్ట్రైక్‌తో బంతిని చైనీస్ గోల్ కీపర్‌ను దాటించి పోస్ట్‌లోకి పంపించాడు. దీంతో ఉత్కంఠకు తెరపడి భారత్ ఘన విజయం సాధించింది. మొదటి మూడు క్వార్టర్స్ లో గోల్ సాధించలేకపోయినా, భారత ఆటగాళ్లు నిరాశ పడకుండా సానుకూల దృక్పథంతో ఆడారు. ఏకైక గోల్ సాధించడంలో వ్యూహాత్మకంగా ఆడారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్... జుగ్‌రాజ్‌కి బంతిని పాస్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. చైనా ఆటగాళ్లు భారత ఎటాకింగ్ ప్లేయర్ల చుట్టూ తిరుగుతూ అడ్డుతగులుతుండడంతో బంతిని తెలివిగా డిఫెండర్ జుగ్‌రాజ్‌కు కెప్టెన్ అందించాడు. ఈ ప్రయత్నం భారత్‌కు గోల్ సాధించిపెట్టింది.

గీత కార్మికులకు 10 శాతం షాపులు

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు 70 శాతం ఉద్యోగులను ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల పేరుతో బ్రాండ్స్ లేకుండా చేశారు. సొంత బ్రాండ్లను అందుబాటులోకి తెచ్చారు. 2019 ఎన్నికల్లో మద్యపాన నిషేధం అంటూ మాయమాటలు చెప్పి... దశల వారీగా నియంత్రణ అంటూ ప్రజలను మోసం చేశారు. సామాన్యుడు అప్పు తెచ్చి, పుస్తెలు అమ్మి మందు తాగే దుస్థితి తీసుకొచ్చారు. దీంతో మద్యం ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం వారి జేబుల్లోకి వెళ్లిపోయింది. డిప్యుటేషన్ మీద అర్హత లేని వ్యక్తిని తీసుకొచ్చి వ్యవస్థను భ్రష్టు పట్టించారు. వారి విధానంతో మల్టీ నేషనల్ కంపెనీలు వెనక్కి వెళ్లిపోయాయి. నాసిరకం మద్యం తాగి చాలామంది అనారోగ్యంపాలై మృత్యువాత పడ్డారు. కిడ్నీ సమస్యలు, పెరాలసిస్ వంటి సమస్యలతో మంచానపడ్డారు. డిస్టలరీస్ వ్యవస్థను కూడా వారి చేతుల్లోకి తీసేసుకున్నారు. దాదాపు రూ.19 వేల కోట్ల నిధులు దారి మళ్లించారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్య విధానంపై ఆరు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం చేశాం. అక్కడి ప్రభుత్వ, ప్రైవేట్ మద్యం షాపులు, ప్రభుత్వ, ప్రైవేట్ కలిపి నడుపుతున్న పరిస్థితులను పరిశీలించి, తక్కువ ధరలకు నాణ్యమైన మద్యం అందించేలా ప్రతిపాదనలు సిద్ధం చేశాం' అని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో వీటిపై చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల హామీ మేరకు గీత కార్మికులకు 10 రిజర్వేషన్లు కల్పించి మద్యం షాపులు కేటాయిస్తామన్నారు. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ అలాగే జిల్లా స్థాయి కమిటీలు కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మద్యం రేట్ల విషయంలో ఒకేరోజు 128, 129 పేర్లతో రెండు జీవోలు జారీ అయ్యాయన్నారు. కొత్త విధానంతో రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు తోడు సర్వీస్ ఇండస్ట్రీ, పర్యాటకశాఖల బలోపేతానికి ఆస్కారం కలుగుతుందని అన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ 2014-19లో 36 వేల కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలు నమోదైతే.. 2019-24లో ఆ సంఖ్య 56 వేలకు పెరిగిందని తెలిపారు. ఏపీ బేవరేజ్ కార్పొరేషన్ పేరుతో రూ.13 వేల కోట్లు అప్పు తెచ్చారని విమర్శించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సెర్ప్ లెక్కల ప్రకారం ఐదేళ్లలో నాసిరకం మందు విక్రయాలతో ఎంతోమంది చనిపోయారని, పర్యవసానంగా వితంతు, ఒంటరి పెన్షన్లు పెరిగాయని తెలిపారు.

రేపటి నుంచి టెట్ మాక్ టెస్టులు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 16 వేల పోస్టులతో డీఎస్సీ ప్రకటించింది. ఐదేళ్ల తర్వాత డీఎస్సీ పోస్టుల భర్తీకి ప్రకటన రావడంతో భారీగా పోటీ నెలకొంది. డీఎస్సీ రాయాలంటే టెట్‌లో తప్పనిసరిగా అర్హత సాధించి తీరాలి. టెట్‌లో 20 శాతం వెయిటేజీ మార్కులుంటాయి. డీఎస్సీకి 80 మార్కులతో పరీక్షలు నిర్వహిస్తారు. టెట్+డీఎస్సీ మార్కులతో ప్రతిభ జాబితా రూపొందిస్తారు. గతంలో టెట్‌లో అర్హత సాధించిన వారంతా వెయిటేజీ మార్కుల కోసం ఇప్పుడు కూడా పరీక్ష రాస్తున్నారు. కొత్తగా డీఎడ్, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు, చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు తొలిసారిగా పరీక్షలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోచింగ్ సెంటర్లు టెట్ కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని టెట్‌కు దరఖాస్తులు పోటెత్తాయి. 22వ తేదీ నుంచి ఏపీ టెట్ హాల్ టికెట్లను సీఎస్‌సీ.ఏపీ.గొవ్.ఇన్.వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మాక్‌టెస్ట్ పరీక్షలను ఈనెల 19వ తేదీ నుంచి నిర్వహిస్తారు. అభ్యర్థులు తమ మొబైల్ లేదా కంప్యూటర్‌లో ఈ నమూనా పరీక్ష పత్రాలు సాధన చేయవచ్చని అధికారులు వివరించారు. మాక్ టెస్ట్‌లు సాధన చేయడం ద్వారా ఆన్‌లైన్లో నిర్వహించే టెట్ పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటుంది. టెట్ పరీక్షల్లో ఎలాంటి మార్పుల్లేవు. అభ్యర్థుల విన్నపాల మేరకు ఇప్పటికే ఒక విడతగా టెట్ పరీక్షలు వాయిదా వేశారు. లేకుంటే ఇప్పటికే పరీక్షలు పూర్తయి... డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చేది. ప్రస్తుత షెడ్యూలు ఆధారంగా అక్టోబరు 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రెండు సెషన్లుగా టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. పేపర్-1ఏ, 1బీ, పేపర్-2ఏ, 2బీ విధానంలో పరీక్షలు జరుపుతారు. ప్రతి రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు సెషన్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సెషన్-2లో పరీక్షలు నిర్వహిస్తారు. నవంబరు 2వ తేదీన ఫలితాలు ప్రకటిస్తారు. టెట్ పరీక్షల నిర్వహణపై స్పష్టత రావడంతో... డీఎస్సీ షెడ్యూలుపై అభ్యర్థులు పెట్టుకున్నారు.

మంత్రులకు దడ!

(మొదటిపేజీ తరువాయి)

రేగుతోంది. కేబినెట్‌లో తీసుకునే నిర్ణయాల కంటే తమ పనితీరుపై సీఎం ఏం చెప్పబోతున్నారనే దానిపైనే వారు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఇటీవల కృష్ణా నదికి వచ్చిన భారీ వరద, ఉప్పొంగిన బుడమేరుతో విజయవాడ నగరంలోని సగం డివిజన్లు ముంపుకు గురైన నేపథ్యంలో వివిధ శాఖల మంత్రులు, శాసనసభ్యులు, అధికారుల పనితీరును కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించనున్నారు. వరద వచ్చిన దగ్గర నుంచి తగ్గేవరకు దాదాపు 10 రోజులపాటు చంద్రబాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ఆఫీస్‌లోనే ఉండి బాధితులకు సహాయకచర్యలు వేగవంతంగా అందేలా కృషి చేశారు. సీఎంతో పాటు మున్సిపల్ మంత్రి పి.నారాయణ, జల వనరుల శాఖా మంత్రి రామానాయుడు, విద్యుత్‌శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తదితరులు తీవ్రంగా శ్రమించి బాధితుల ప్రశంసలందుకున్నారు. బుడమేరుకు పడిన గండ్లు పూడ్చివేతలో రామానాయుడు జోరువానలోనూ రేయంబవళ్లు కట్టపైనే ఉండి మరమ్మతు పనులు శరవేగంగా పూర్తి చేయించారు. అలాగే మంత్రి నారాయణ ముంపు ప్రాంతాల్లో వరద నీటిని తొలగించడంలో, ఫైర్ ఇంజన్ల ద్వారా ఇళ్లను, రోడ్లను శుభ్రం చేయించడంలో, పారిశుద్య పనులు వేగవంతంగా చేయించడంలో, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, మున్సిపల్ కుళాయిల పునరుద్ధరణ వంటి చర్యలు చేపట్టడంలో నిర్విరామ కృషి చేశారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో, వరద నీరు తగ్గగానే కరెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించడంలో అద్భుత పనితీరును కనబరిచారు. ఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ వరద ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా సత్వర చర్యలు తీసుకున్నారు. ఇక ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగవంతం చేయడంలో, బాధితులకు కష్టకాలంలో సహాయక చర్యలు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవడంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజనతో పాటు, మరికొందరు అధికారులు అంకితభావంతో సేవలందించారు. వీరందరినీ మంత్రివర్గ సమావేశంలో ప్రశంసించే అవకాశాలున్నాయి. జనసేన మంత్రుల గ్రాఫ్‌ను పవన్ కల్యాణ్‌కు అందజేయనున్నారు. అనంతరం మంత్రులు తమ పనితీరు మెరుగుపర్చుకునే దిశగా చంద్రబాబు వారికి దిశానిర్దేశం చేయనున్నారు. ఇక అక్టోబర్ 1 నుంచి అమల్లోకి రానున్న నూతన మద్యం విధానంపై కూడా ఈసమావేశంలో చర్చించనున్నారు. దీనిపై మంత్రివర్గ ఉపసంఘం తమ ప్రతిపాదనలు సమర్పించనుంది. అదేవిధంగా బాధితులకు అందజేసే నష్టపరిహారం, రాజధాని నిర్మాణపనులు, వరద నష్టంపై కేంద్ర సహాయం తదితర అంశాలు ఈ సమావేశంలో చర్చకు రానున్నాయి.

ఒడిశా కాలేజిలో బీఫ్ కలకం

బజరంగ్ దళ్ ఫిర్యాదుతో ఏడుగురు విద్యార్థుల తొలగింపు

భువనేశ్వర్: ఒడిశాలో కాషాయ పట్టు పెరుగుతోంది. కాలేజి కాషాయం పులుముకుంటున్నాయి. ఇందుకు బెర్హంపూర్‌లోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజిలో ఏడుగురు విద్యార్థుల బహిష్కరణ సూచికగా నిలిచింది. గోరక్ష పేరిట బజరంగ్ దళ్, విశ్వహింతూ పరిషత్ వంటి కాషాయ సంఘాలు రెచ్చిపోతున్నాయి. 'బీఫ్' తిన్నారు, తరలించారు అంటూ ఇష్టారాజ్యంగా నిందలు మోపుతున్నాయి. తాజాగా బెర్హంపూర్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఏడుగురు వీరి కాషాయ కుట్రకు బాధితులయ్యారు. హాస్టల్‌లో బీఫ్ వండారంటూ బజరంగ్ దళ్ ఆరోపణలు చేయడం స్థానికంగా కలకలం రేపింది. బెర్హంపూర్‌లో పరాలా మహారాజ ఇంజినీరింగ్ కళాశాల (పీఎంఈసీ) దక్షిణ ఒడిశాలోని ప్రతిష్టాత్మక ప్రభుత్వ విద్యాసంస్థ. బజరంగ్ దళ్ ఫిర్యాదుతో ఏడుగురు విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ఈ ఘటన బెర్హంపూర్ ప్రజలను షాక్‌కు గురిచేసింది. తాజా పరిణామంపై బెర్హంపూర్ మేధావులు, నాయకులు పెదవి విరిచారు. హిందూత్వ వాదులకు తొలొగ్గి కాలేజి నిర్వాహకులు వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. 'ఇలాంటి ఘటన మునుపెన్నడూ వినలేదు. నేను విద్యార్థిగా ఉన్నప్పుడూ ఇటువంటివి జరగలేదు' అని ప్రముఖ వైద్యుడు శివ ప్రసాద్ దాస్ అన్నారు. బలమైన సాక్ష్యాధారాలు లేకుండా విద్యార్థుల విషయంలో కాలేజి యంత్రాంగం ఇంత కఠినంగా వ్యవహరించడం తగదని స్థానికుడు రిషికేశ్ రథ్ అభిప్రాయపడ్డారు. ఇంజినీరింగ్ కాలేజిలో జరిగిన ఘటనతో స్థానికంగా కాషాయ పట్టు పెరుగుతోందని అర్థమవుతోందని రాజకీయ విశ్లేషకులు సబితా మొహంతీ అన్నారు. ఇటువంటి వ్యవహారాలలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన కాలేజి యంత్రాంగాలు రాజకీయ, ఇతర బాహ్య శక్తుల ఒత్తిళ్లకు గురి కావడం మంచిది కాదని హితవు పలికారు. బహిష్కరణకు గురైన ఏడుగురు విద్యార్థుల్లో ఐదుగురు ముస్లింలు ఉన్నారు.

వరద బాధితులకు ప్రత్యేక ప్యాకేజీ

(మొదటిపేజీ తరువాయి)

రూ.10వేలు, చెరకు పంటకు రూ.25వేలు చొప్పున పరిహారం చెల్లిస్తామని చంద్రబాబు ప్రకటించారు. అలాగే చేనేత కార్మికులకు రూ.15వేలు. ఒక్కో కోడికి రూ.100, షెడ్డు ధ్వంసమైతే రూ.5వేలు. పశువులకు రూ.50వేలు, ఎద్దులకు రూ.40వేలు. దూడలకు రూ.25వేలు, గొర్రెలకు రూ.7500. హెక్టారు పత్తికి రూ.25వేలు, వేరుశనగకు , హెక్టార్ ఫిషింగ్ ఫామ్ డీసిల్టేషన్, రెస్టిరేషన్‌కు రూ.15వేలు, పసుపు, అరటికి రూ.35వేలు, మొక్క జొన్న, కొర్ర, సామ, రాగులకు హెక్టారుకు రూ.15వేలు చొప్పున ఇస్తామని తెలిపారు. నష్టపోయిన ఎంఎస్ఎంఈలకు కూడా ఆర్థిక సహాయం అందజేస్తామని, రూ.40లక్షల నుంచి రూ.1.5 కోట్ల టర్నోవర్ ఉన్న పరిశ్రమలకు రూ.లక్ష, రూ.1.5 కోట్లకు పైగా టర్నోవర్ ఉన్న వాటికి రూ.1.5లక్షలు ఇస్తామని తెలిపారు. బైక్‌ల బీమా, మరమ్మతులకు సంబంధించి 9వేలకు పైగా క్లెయిమ్‌లు పరిష్కరించామని, ద్విచక్రవాహనదారులు రూ.71 కోట్ల మేర క్లెయిమ్‌లు చేయగా, ఇప్పటికే రూ.6కోట్లు చెల్లింపులు చేయగా, మరో 6వేల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని సీఎం వివరించారు.

జమ్మూకశ్మీర్ పోలింగ్ నేడు

(మొదటిపేజీ తరువాయి)

దింపింది. పంపోరా, ట్రాల్, పుల్వామా, రాజ్‌పుర, జైనపుర, షోపియాన్, డీహెచ్ పుర, కుల్గామ్, దేవ్‌సర్, దూరు, కోకర్‌నాగ్ (ఎస్‌టీ), అనంత్‌నాగ్ వెస్ట్, అనంత్‌నాగ్, శ్రీగుఫ్వారా-బిజ్‌బహరా, షంగస్-అనంత్‌నాగ్ ఈస్ట్, పహల్‌గామ్, ఇందర్‌వాల్, కిష్త్వారా, పడేర్-నాగ్‌సెని, భదర్వా, దోడా, దోడా వెస్ట్, రాంబన్, బనిహాల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు తొలి దశలో ఎన్నికలు జరగనున్నాయి. కాగా, పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ తనయ ఇల్తిజా ముఫ్తీ మొదటిసారి పోటీ చేస్తున్నారు.

తొలి దశలో పోలింగ్ జరగబోయే 24 స్థానాలకు ఎనిమిది జమ్మూ డివిజన్‌లో, 16 కాశ్మీర్ లోయలో ఉన్నాయి. అనంత్‌నాగ్ జిల్లాలో ఏడు, పుల్వామాలో నాలుగు, కుల్గామ్‌లో మూడు, కిష్త్వారా, దోడా, షోపియాన్, రాంబన్ జిల్లాల్లో రెండు చొప్పున స్థానాల్లో ఓటింగ్ జరగబోతోంది. తొమ్మిది మంది మహిళా అభ్యర్థులు మాత్రమే తొలి దశలో పోటీ చేస్తున్నారు. మరో 92 మంది స్వతంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అభ్యర్థుల్లో 110 మంది లక్షాధికారులు కాగా 36 మంది నేర చరితులు ఉన్నారు. మెహబూబా ముఫ్తీ నేతృత్వంలోని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) నుంచి పోటీ చేస్తున్న 21 మందిలో 18 మంది కోటీశ్వరులు ఉన్నారు. ముఫ్తీ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బిజ్‌బెహరా నుంచి ఇల్తిజా ముఫ్తీ పోటీ చేస్తున్నారు. ఈ స్థానం నుంచి ఎన్‌సీ అభ్యర్థి బషీర్ అహ్మద్ వీరి, బీజేపీ తరపున సోఫీ మహమ్మద్ యూసుఫ్ పోటీ చేస్తుండటంతో ఇక్కడ త్రిముఖ పోరు జరగనుంది. బిజ్‌బహరా స్థానం రాజౌరీ-అనంతనాగ్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది.

ఏఐటీయూసీ పోరాట స్ఫూర్తి ఆదర్శం

అనేక చట్టాల రూపకల్పనకు పునాది: రవీంద్రనాథ్

ముగిసిన స్కీమ్ వర్కర్ల రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన అమరవీరుల త్యాగాల చరిత్ర పుటల నుంచి ఉజ్వల పోరాట పటిమతో ఏఐటీయూసీ 1920లో ఆవిర్భవించిందని రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అన్నారు. బ్రిటీష్ వారిని ఈ దేశం నుంచి తరిమికొట్టడంలో ఏఐటీయూసీ ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. స్కీమ్ వర్కర్ల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు కడప జిల్లా ప్రొద్దుటూరులో మంగళవారం ముగిశాయి. 'ఏఐటీయూసీ చరిత్ర-ఉజ్వల ఘట్టాలు' అంశంపై ఆర్. రవీంద్రనాథ్, ప్రపంచీకరణ-ఆర్థిక సామాజిక రంగాలలో పాత్ర అంశంపై ఏఐటీయూసీ పూర్వపు నాయకులు ఎం.వెంకయ్య, మహిళా చట్టాలు- తీరుతెన్నులు అంశంపై రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి బోధించారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం కార్మిక హక్కుల సాధన కోసం, అనేక చట్టాల రూపకల్పనకు ఏఐటీయూసీ పునాది వేసిందన్నారు. స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అని సమరవీరులు నినదించారన్నారు. కార్మికులకు పని ప్రదేశంలో మౌలిక వసతులతో పాటు పని భద్రత, కనీస వేతనాల అమలు కోసం ఏఐటీయూసీ ఉద్యమించిందని, సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల న్యాయమైన సమస్యల కోసం పోరాటంలో ముందు వరుసలో నిలిచిందని అన్నారు. ఏఐటీయూసీ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని... ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న మహిళా కార్మికుల వేతనాల పెంపు కోసం ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను ఉద్యోగులుగా కేంద్ర, ప్రభుత్వాలు గుర్తించాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అనేక పరిశ్రమల్లో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, పని గంటలకు సరైన విధానం లేదని, వేతనాలు కనీసస్థాయికి పడిపోయాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న అన్ని సదుపాయాలు స్కీమ్ కార్మికులకు వర్తింప చేయాలని, వేతనాలు పెంచి... పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో కార్మిక వర్గానికి చంద్రబాబు ప్రభుత్వం మంచి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే పోరాటబాట పడతామని హెచ్చరించారు. స్కీమ్ వర్కర్ల యూనియన్ రాష్ట్ర నాయకులు లలితమ్మ, మంజుల, రమేశ్ బాబు, స్రవంతి, సుభాషిని, బాలకృష్ణ, శాంతి, ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, చాంద్ భాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్తూరులో సీపీఐ ధర్నా

రైతుల సమస్యల పరిష్కారానికి, సర్వీస్ రోడ్డు నిర్మాణానికి డిమాండ్

22న వంటావార్పునకు పిలుపు

విశాలాంధ్ర-తిరుపతి: చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతుల నోట్లో మట్టి కొట్టేలా కేంద్ర ఉపరితల రవాణా శాఖ వ్యవహారం ఉందని సీపీఐ, రైతు సంఘం నాయకులు విమర్శించారు. రైతులకు న్యాయం చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హైవే వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణం, రైతుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం చిత్తూరులో ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారు. అలాగే 22వ తేదీన వంటా-వార్పును జాతీయ రహదారిపై చేపడతామని, ఈ కార్యక్రమానికి సీపీఐ కార్యదర్శి కె.నారాయణ హాజరవుతారని నాయకులు తెలిపారు. జాతీయ రహదారి పరిసర ప్రాంతాల్లో ఉన్న రైతుల సమస్యలను సీపీఐ, రైతు సంఘం ప్రతినిధులు మంగళవారం తెలుసుకున్నారు. కరూర్, పాదిరి, బూచానత్తం, అయినంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాల రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సీపీఐ, రైతు సంఘం సహకారంతో మా భూములకు పరిహారం ఎకరాకు రూ.8 లక్షల నుండి రూ.16లక్షలకు పెంచు కోగలిగామన్నారు. రహదారి పూర్తి కావస్తున్నా ఎంఓయూకు విరుద్ధంగా... తమకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి సర్వీస్ రోడ్డు లేకుండా చేయడం దుర్మార్గమని అన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న గ్రామాలకు, పొలాలకు సబ్‌వే ఏర్పాటులో వివక్ష చూపుతున్నట్లు విమర్శించారు. రోడ్డుకు అవసరమైన గ్రావెల్ కోసం కొండలు, గుట్టలు ధ్వంసం చేసి ఈజిప్టు పిరమిడ్లను తలపించేలా తవ్వకాలు చేపట్టారని ఆరోపించారు. హైవే కాంట్రాక్టర్ దుశ్చర్యలపై చర్యలను డిమాండ్ చేశారు. దీంతో రైతాంగ సమస్యల పరిష్కారానికి నాయకుడు ధర్నాకు పిలుపునిచ్చారు. ప్రతినిధి బృందంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు, రైతు సంఘం నేత జనార్దన్, సీపీఐ నాయకులు చిన్ని రాజ్, మహేశ్, గురుమూర్తి ,చిరంజీవి నాయుడు, కృష్ణారెడ్డి కుమార్ రవి ఉన్నారు.

ముగిసిన నందిగం సురేశ్ పోలీస్ కస్టడీ

విశాలాంధ్ర-మంగళగిరి : తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంపై దాడి ఘటనలో మంగళగిరి రూరల్ సర్కిల్ కార్యాలయంలో రెండు రోజులపాటు కొనసాగిన వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ విచారణ మంగళవారం ముగిసింది. మంగళగిరి రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు విచారణ అధికారిగా వ్యవహరించారు. మంగళవారం ఉదయం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు నందిగం సురేశ్ కస్టడీ ముగియటంతో ఆయనను మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరిచిన పోలీసులు అనంతరం గుంటూరు జైలుకు తరలించారు. ఈ కేసు విషయమై మంగళగిరి రూరల్ సర్కిల్‌కు గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ విచ్చేసి మీడియాతో మాట్లాడారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో 110 మందిని గుర్తించామని, అరెస్టు చేయవద్దంటూ ఇప్పటికే చాలా మంది కోర్టుకు వెళ్లారని ఆయన తెలిపారు. ఇంకా కొంతమందిని విచారణకు త్వరలో పిలుస్తామని ఎస్పీ చెప్పారు. ఈ కేసులో 14 మంది ముందస్తు అరెస్టు లేకుండా బెయిల్‌పై ఉన్నారని, నలుగురు ప్రొటెక్షన్‌లో ఉన్నారని, ముగ్గురుని అరెస్టు చేశామని, తొమ్మిది మందిని అరెస్టు చేయవలసి ఉందని వివరించారు. కింది కోర్టులో 24 మందిని ఈ నెల 26 వరకు అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు ఉన్నాయని, 26 తర్వాత కోర్టు తీర్పును అనుసరించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ వెల్లడించారు. పోలీసు విచారణలో నందిగం సురేశ్ సహకరించారని, సురేష్ చెప్పిన సమాధానాలను నిర్ధారించుకోవలసి ఉందని తెలియజేశారు. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తమలపాకు పంటకు ఉపాధి పథకం అనుసంధానించాలి

కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-పాయకరావుపేట: అందరి నోరు పండించే తమలపాకు... ఆ పంట సాగు చేసే రైతు బతుకు పండించటం లేదని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలంలోని సత్యవరం గ్రామంలో తమలపాకు పండించే రైతులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక మంది తమలపాకు రైతులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇతర పంటలకు ఉన్నట్లుగానే తమలపాకు పంటకు బీమా సౌకర్యం లేదని, గ్రేడింగ్ చేసుకునేందుకు షెడ్లు లేవని, గిట్టుబాటు ధర లేదని, కోల్డ్ స్టోరేజ్‌లు లేవని తదితర సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1,634 హెక్టార్లలో తమలపాకును పండిస్తున్నారని తెలిపారు. అధికారుల అంచనాల ప్రకారం ప్రతి ఏటా 57,276 లక్షల తమలపాకులను రైతులు ఉత్పత్తి చేస్తున్నారని అన్నారు. తమలపాకు పండించటం చాలా కష్టం, వ్యయంతో కూడుకున్నదని, ఎకరా భూమిలో తమలపాకు పండించడానికి సుమారు రెండున్నర లక్షల రూపాయల ఖర్చవుతుందని తెలిపారు. అయితే పంటకు ప్రభుత్వం భరోసా ఇవ్వలేకపోతుందని విమర్శించారు. ఈ ప్రాంతం తమలపాకు సాగులో రాష్ట్రంలో ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. ఇటీవల పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో తమలపాకు రైతులతో మహాసభలు నిర్వహించామని, ఆల్ ఇండియా తమలపాకు సంఘం ఒకటి ఏర్పాటుకు యోచిస్తున్నట్లు చెప్పారు. రైతులంతా సొసైటీగా ఏర్పడితేనే బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతాయన్నారు. త్వరలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి తమలపాకు పండించే రైతులకు రుణాలు కల్పించాలని కోరతామని తెలిపారు. స్వామినాథన్ కమిషన్ కమిటీ సిఫార్సు మేరకు పండించిన తమలపాకు పంటకు ఖర్చులకు అనుగుణంగా గిట్టుబాటు ధర కల్పించాలని, మద్దతు ధరకు పార్లమెంటులో చట్టం చేయాలని, తమలపాకు రైతులకు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, తమలపాకు పంటకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని, పండించిన పంటకు మార్కెట్ సదుపాయం కల్పించాలని, ఎరువులు, పురుగు మందులు రాయితీపై అందించాలని తదితర డిమాండ్లతో ప్రభుత్వాన్ని కోరతామని కేవీవీ ప్రసాద్ అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ల మాతి నాయుడు, జాతీయ సమితి సభ్యులు రావు వెంకట జగ్గారావు, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ చెలికాని కృష్ణమోహన్ రావు, రౌతు రామచంద్ర, సీపీఐ మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు, రైతులు బోయిడి బుల్లిబాబు, బోయిడి సన్యాసిరావు, జి.తమ్మయ్య రాజు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు... యువత పుస్తకాలు చదవాలి

విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రారంభించిన కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అన్నారు. పుస్తక ప్రదర్శనను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విజయనగరం గురజాడ కేంద్ర గ్రంథాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విశాలాంధ్ర పుస్తక ప్రదర్శనను మంగళవారం ఆయన ప్రారంభించారు. పుస్తక ప్రదర్శనను కలెక్టర్ ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. సాహిత్యంతో తనకున్న అనుబంధాన్ని, తనకు స్ఫూర్తి కలిగించిన పుస్తకాలను గుర్తుచేసుకున్నారు బుచ్చిబాబు విరచిత, చివరకు మిగిలేది నవల వర్తమాన సామాజిక పరిస్థితులకు ఎంత దగ్గర ఉన్నదీ తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన విద్యార్థి దశ నుంచి విశాలాంధ్ర పబ్లికేషన్స్ పుస్తకాలను చదివేవాడినని తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండే ధరలతో సాహిత్యం, కళలు తదితర అంశాలతో కూడిన పుస్తకాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారని అన్నారు. విజయనగర జిల్లా వాసులకు సాహిత్యం పట్ల మమకారం ఎక్కువని, అందరూ పుస్తక ప్రదర్శనను వినియోగించుకోవాలి సూచించారు. ముఖ్యంగా విద్యార్థులు, పోటీ పరీక్షలకు వెళ్లే యువత పుస్తక ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ ఎస్.ఇబ్రహీం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార శాఖ ఏడీ డి.రమేష్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు, తహశీల్దార్ కూర్మనాధరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సునీల్, నాగభూషణం, గౌరీశంకర్, విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ఇంఛార్జి వేణు, విశాలాంధ్ర స్టాఫ్ రిపోర్టర్ బి.నాగేంద్ర ప్రసాద్, ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర పరిశ్రమల్లో భద్రతా తనిఖీలు

సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో వివిధ ప్రమాదకర పరిశ్రమల్లో మూడు నెలలకు ఒకసారి తప్పకుండా భద్రతా తనిఖీలు నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేయడం ద్వారా నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన ఐటిఇ అండ్ సీ, ఎస్ఆర్ఐ ఎంపవర్‌మెంట్, పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ, పరిశ్రమలు, వాణిజ్యం, కార్మిక, ఫ్యాక్టరీలు తదితర విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమల శాఖకు సంబంధించి మాట్లాడుతూ ప్రమాదకర పరిశ్రమల్లో మూడు నెలలకు ఒకసారి భద్రతా తనిఖీలను తప్పక నిర్వహించాలని ఆదేశించారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకునేలా చూడాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టి అమలు చేసిన వివిధ పథకాలు, కార్యక్రమా లను పూర్తిగా సమీక్షించుకో వాల్సిన అవసరం ఉందని సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ఐటీ శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, పర్యాటక శాఖ ఇంఛార్జి ఎండీ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు. అలాగే ఎస్.సురేశ్ కుమార్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి డా.ఎన్.యువరాజ్, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయకుమార్ వర్చువల్‌గా పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అల్లూరి జిల్లా రంపచోడవరం ఏపీ గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రిన్సిపాల్ క్రమశిక్షణ పేరుతో విద్యార్థినులతో వందకు పైగా గుంజీలు మూడు రోజుల పాటు తీయించడం ద్వారా దండనకు గురిచేశారని ధ్వజమెత్తారు. విద్యార్థినులు తన మాట వినడం లేదని, ఆగ్రహానికి గురైన ప్రిన్సిపాల్ గుంజీలు తీయాలని ఆదేశించడంతో నాల్గవ రోజుకు ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు గుంజీలు తీయలేక కళ్లు తిరిగి పడిపోయి, అనారోగ్యానికి గురయ్యారని తెలిపారు. దీనికి బాధ్యులైన ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

మంత్రులు ఫరూక్, జనార్దన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బుడమేరు వరద బీభత్సంతో తీవ్రంగా నష్టపోయిన ముంపు బాధితులు అందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంటుందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం విజయవాడ పంజా సెంటర్ ప్రాంతంలో నంద్యాలకు చెందిన గురు రాఘవేంద్ర విద్యాసంస్థల తరపున డైరెక్టర్లు షేక్షావల్ రెడ్డి, మౌలాలి రెడ్డి నేతృత్వంలో వెయ్యి మంది బాధిత కుటుంబాలకు 10 కిలోల చొప్పున బియ్యం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా మంత్రులు ఫరూక్, జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ వరద ముంపుతో నష్టపోయిన బాధితులందరినీ ఆదుకునేందుకు క్షేత్ర స్థాయిలో ప్రణాళికాబద్ధంగా అధికార యంత్రాంగం ఇంటింటికీ వెళ్లి పరిశీలించి నివేదిక రూపొందించిందని తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు పారిశ్రామిక వేత్తలు, వ్యాపార వేత్తలు, ప్రముఖులు, వివిధ సేవా సంస్థలు, విద్యాసంస్థలు, ఎందరో దాతలు, వివిధ వర్గాల వారంతా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు అందజేస్తూ తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ, టీడీపీ మైనార్టీ నాయకుడు ఎం.ఎస్.బేగ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యపై కూటమి ప్రభుత్వం కుట్ర

ఎంపీ గురుమూర్తి, ఏఐఎస్ఎఫ్ నేత శివారెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు గుప్పెట్లోకి తీసుకెళ్లే దిశగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఇదే జరిగితే మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థకు తూట్లు పడే ప్రమాదం ఉందని, వైద్య విద్య పూర్తిగా ప్రైవేటు పరం అవుతుందని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శివారెడ్డి హెచ్చరించారు. స్థానిక గంధమనేని శివయ్య భవన్ నందు ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మద్దెల గురుమూర్తి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శివారెడ్డి మాట్లాడుతూ గుజరాత్ మోడల్‌తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేసే కుట్రను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. చంద్రబాబు 2015లో అధికారంలో ఉన్నప్పుడు చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిని, వైద్య కళాశాలను అపోలోకు అప్పగించేందుకు జీవో నంబరు 125 తీసుకొచ్చి మూడేళ్ల లీజుకు ఇచ్చేశాడని, తరువాత 2016లో జీవో నంబరు 40 తీసుకువచ్చి ఏకంగా 30 ఏళ్ల లీజుకు ఇచ్చాడని విమర్శించారు. గత ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ఏర్పాటు చేసినప్పటికీ, జీవో నంబరు 107,108తో 50 శాతం బి, సి కేటగిరీలో సెల్ఫ్ ఫైనాన్స్ విధానం కింద సీట్ల కేటాయింపు చేపట్టిందన్నారు. దాంతో నీట్‌లో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులు నష్టపోయారని తెలిపారు జీవో నంబరు 107,108 రద్దు చేస్తామని చెప్పిన కూటమి నేతలు ఇప్పుడు సాకులు చెబుతూ వైద్య విద్యను ప్రైవేటు గుప్పిట్లో పెట్టేందుకు ముందుకు వెళుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, పోస్టులు భర్తీ చేయాలని, పూర్తి భవనాలను నిర్మించాలని, సీట్లను పూర్తిస్థాయిలో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయ చంద్ర, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రవి, నాయకులు మల్లికార్జున, మోహన్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉదయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, అక్బర్, అశోక్, పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి ఆశ, ఏఐటీఎస్ఓ జిల్లా కార్యదర్శి నవీన్, ఏపీ జేఏసీ జిల్లా కార్యదర్శి శ్రీధర్ గిరిజన విద్యార్థి సంఘం నాయకులు శంకర్ నాయక్, సురేష్ నాయక్, మహేంద్ర పాల్గొన్నారు.

అందుబాటులో 13,87,504 మెట్రిక్ టన్నుల ఇసుక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బుధవారం నాటికి 24 ఇసుక నిల్వ కేంద్రాలలో 13,87,504 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్, గనులు, అబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. మంగళవారం 6,585 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం రాష్ట్ర వ్యాప్తంగా 650 మంది దరఖాస్తు చేసుకోగా, వీరందరితో పాటు పెండింగ్‌లో ఉన్న 488 దరఖాస్తుదారులకు 6,810 మెట్రిక్ టన్నుల ఇసుకను వెరసి మొత్తంగా 1,138 దరఖాస్తుదారులకు 13,395 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితులు, వరద ప్రభావిత ప్రాంతాల వల్ల ఇసుక నిల్వలు తగ్గుముఖం పడుతున్నాయని, వర్షాకాలం ముగిసిన తరువాత ఇసుక నిల్వలకు కొరత ఉండబోదని మీనా తెలిపారు. అనేక చోట్ల రహదారులు దెబ్బతిన్న పరిస్థితిలో ఇసుక రవాణాకు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని, వినియోగదారులు తమవంతు సహకారం అందించాలని కోరారు.

ఎల్జీ పాలిమర్స్ బాధితులకు అండగా ఉంటాం

విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: ఎల్జీ పాలిమర్స్ బాధిత, ప్రభావిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని విశాఖపట్టణం పార్లమెంటు సభ్యుడు శ్రీభరత్ అన్నారు. 2020వ సంవత్సరంలో జరిగిన దుర్ఘటన నేపథ్యాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, ఎల్జీ పాలిమర్స్ కంపెనీ ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సూచనల మేరకు కంపెనీ ప్రతినిధులతో కలిసి సహాయక చర్యలు చేపడతామని వెల్లడించారు. పాలిమర్స్ కంపెనీ చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామాల ప్రజలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని, భవిష్యత్‌లో వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దుర్ఘటన జరిగిన సమయంలో 12 కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేసినప్పటికీ తర్వాత కాలంలో వారిని పట్టించుకునే నాధుడే కరువయ్యారని, ఇప్పుడు ముఖ్యమంత్రి చొరవతో, కంపెనీ ప్రతినిధుల మానవీయతతో ఆ ప్రాంత ప్రజలకు సహాయం చేయనున్నామని తెలిపారు. ఎల్జీ పాలిమర్స్ కంపెనీ కార్పొరేట్ కమ్యునికేషన్స్ హెడ్ పాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఎల్జీ పాలిమర్స్ బాధిత కుటుంబాలకు, పరిసర గ్రామాల ప్రభావిత ప్రజలకు రెండు దశల్లో ఆర్థిక చేయూత అందిస్తామని తెలిపారు. మొదటి దశలో రూ.60 కోట్లతో నష్ట పరిహారం చెల్లిస్తామని, రెండో దశలో రూ.60 కోట్లు వెచ్చించి పర్యావరణ హిత అభివృద్ధి పనులు చేపడతామని, స్థానికుల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎల్జీ పాలిమర్స్ కంపెనీ పరిసర ప్రాంత ఏడు గ్రామాల్లో సుమారు 6,121 కుటుంబాలను ప్రాథమికంగా గుర్తించామన్నారు. వారిలో బాధిత కుటుంబాలతో పాటు ప్రభావిత కుటుంబాలు కూడా ఉన్నాయని, వారందరికీ దశల వారీగా ఆర్థిక చేయూత అందిస్తామని వెల్లడించారు. ఫౌండేషన్ ద్వారా పర్యావరణం, తాగు నీరు, వైద్య సదుపాయాలు, కాలుష్య నివారణ తదితర అంశాలపై దృష్టి పెడతామన్నారు. స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం సహకారంతో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. హైకోర్టు, జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఉన్న కేసుల విషయంలో యథాతథ స్థితిని కొనసాగిస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నకు కలెక్టర్ సమాధానమిచ్చారు.

సంపాదకీయం

బుల్డోజర్లకు తాత్కాలిక విరామం

న్యాయస్థానాలు ఇచ్చే తీర్పులకు, న్యాయమూర్తులకు దురుద్దేశాలు ఆపాదించకూడదు. కానీ న్యాయస్థానాల తీర్పులను విమర్శించే హక్కు ఎవరికైనా ఉంటుంది. ఒక్కోసారి న్యాయస్థానాల తీర్పులు ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. ఉత్తరప్రదేశ్‌లో యోగీ ఆదిత్యనాథ్ చాలా కాలంగా బుల్డోజర్ రాజకీయాలు నడుపుతున్నారు. అపరాధం చేశారని తమకు ఎవరి మీదైనా ఒక అభిప్రాయం ఏర్పడితే వారి ఇళ్లను బుల్డోజర్‌తో కూల్చి వేయిస్తున్నారు. ఇలా బుల్డోజర్ల ప్రతాపానికి గురవుతున్న ఇళ్లు ఉత్తరప్రదేశ్‌లో చాలా వరకు ముస్లింలవే. ఈ కూల్చివేతలో మరో వైపరీత్యమూ ఉంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లను బుల్డోజర్‌తో కూల్చి వేసిన సందర్భాలూ ఉన్నాయి. అంటే యుక్తాయుక్త విచక్షణ లేకుండా కూల్చి వేతలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం సుప్రీంకోర్టు తాత్కాలికంగా ఒక ఆదేశం జారీ చేసింది. అక్టోబర్ ఒకటో తేదీ దాకా అంటే దాదాపు పది పన్నెండు రోజులపాటు ఏ రాష్ట్రంలోనైనా బుల్డోజర్లు ఉపయోగించి ఇళ్లు కూల్చి వేయకూడదని ఆ ఆదేశాల్లో పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం ఈ కేసును అక్టోబర్ ఒకటిన విచారిస్తుందట. ఆ లోగా ఇళ్లు కూల్చేయకపోతే మిన్ను విరిగి మీద పడేదేమీ లేదు కాబట్టి బుల్డోజర్లకు విరామం ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలు అనధీకృతంగా కూల్చేసే ఇళ్లకే వర్తిస్తుంది. వీధుల్లో, కాలిబాటల్లో, రైలు మార్గాల పక్కన అనుమతి లేకుండా, ఆక్రమించిన స్థలాల మీద నిర్మించిన ఇళ్ల కూల్చివేతకు బుల్డోజర్లకు విరామం ఇవ్వాలన్న ఆదేశం వర్తించదు. దేశంలో ఎక్కడైనా అక్టోబర్ ఒకటి దాకా ప్రైవేటు ఆస్తులను బుల్డోజర్లతో కూల్చి వేయకూడదని సుప్రీంకోర్టు ఆంక్ష విధించింది. ఇలాంటి ఆదేశాలతో ప్రభుత్వం చేతులు కట్టిపడేస్తే ఎలా అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనను అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. రెండు వారాలు కూల్చివేయకపోతే మిన్ను విరిగి మీద పడేదేంలేదు అని న్యాయమూర్తులు బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. అదే సమయంలో అనధికారిక నిర్మాణాలను కూల్చి వేతకు అడ్డంకి ఉండకూడదని న్యాయమూర్తులు చెప్పారు. రాజ్యాంగంలోని 142వ అధికరణం ప్రకారం తమకు సంక్రమించిన ప్రత్యేక అధికారాలను వినియోగించి ఈ తాత్కాలిక ఉత్తర్వు జారీ చేస్తున్నామని న్యాయమూర్తులు చెప్పారు. నేరం చేసిన, లేదా చేశారన్న ఆరోపణ ఉన్న వారి ఇళ్లను కూల్చేయకుండా సుప్రీంకోర్టు ఉత్తర్వుతో తాత్కాలిక ఉపశమనం కలిగింది. "బుల్డోజర్ న్యాయం" మీద ఈ నెలలోనే సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. బుల్డోజర్లతో ఇళ్లు కూల్చేయడాన్ని ఏదో ఘనకార్యంగా భావించనక్కర్లేదని కూడా న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. అక్రమంగా ఒక్క ఇంటిని కూల్చేసినా అది రాజ్యాంగ భావనకు విరుద్ధమే అని న్యాయమూర్తులు అన్నారు. న్యాయం ఏదో అన్యాయమేదో నిర్ణయించే అధికారం కార్య నిర్వాహకవర్గానికి (ప్రభుత్వానికి) లేదని న్యాయమూర్తులు సూటిగా చెప్పారు. అక్రమ నిర్మాణాల విషయంలో తాము మార్గదర్శకాలు రూపొందిస్తామని కూడా న్యాయమూర్తులు అన్నారు. ఏదో నేరం చేశారన్న ఆరోపణ ఉన్నంత మాత్రాన ఇళ్లు ఎలా కూల్చేస్తారని సుప్రీంకోర్టు ఇటీవలే ఆగ్రహం వ్యక్తం చేసింది. నేరానికి శిక్ష ఇంటిని కూల్చేయడం ఏ లెక్కనా న్యాయం కాదు. అక్రమంగా నిర్మించిన ఇళ్లను కూల్చేయడానికి అవకాశం ఉండొచ్చు కానీ ఏదో నేరంచేస్తే బుల్డోజర్లతో ఇళ్లు కూల్చేయడం యోగీ ఆదిత్యనాథ్ ప్రవేశపెట్టిన అన్యాయమైన న్యాయసూత్రం. ప్రతి నేరానికీ నిర్ణీతమైన శిక్ష ఉంటుంది. ఆ శిక్ష విధించే అధికారం న్యాయస్థానాలకే ఉంటుంది. కానీ యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అక్రమ నిర్మాణాలను కూల్చేయడం కాదు. తమ దృష్టిలో దుష్టులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు అనుకునే వారి ఇళ్లను యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం కూల్చేస్తోంది. ఒకవేళ ఎవరైనా ఒక నేరం చేశారని కోర్టులు నిర్ధారిస్తే భారత శిక్షాస్మృతి ప్రకారం నిర్దిష్టమైన శిక్ష ఉంటుంది. అక్రమ నిర్మాణాలకు మినహా ఒక నేరానికి శిక్షగా ఇళ్లు కూల్చేసే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదు. కానీ నేరాల అదుపు పేర యోగీ ఆదిత్యనాథ్ బుల్డోజర్‌నే ప్రధాన ఆయుధంగా వినియోగిస్తున్నారు.

వైపరీత్యం ఏమిటంటే ఎవరినైనా శిక్షించాలనుకున్నప్పుడు కూల్చేస్తున్న ఇల్లు ఆ వ్యక్తిదో కాదో కూడా యోగీ ప్రభుత్వం ఆలోచించడం లేదు. కుటుంబంలో ఎవరు నేరం చేశారనుకున్నా కూల్చేస్తున్న ఇల్లు ఆ వ్యక్తిదో కాదా కూడా ఆలోచించడం లేదు. అంటే ఒక వ్యక్తి నేరం చేశాడనుకున్నప్పుడు కుటుంబానికి నీడనిచ్చే ఇంటిని కూల్చేసే అమానుషం బీజేపీ ప్రభుత్వాన్ని నడుపుతున్న యోగీ హయాంలో నిరాఘాటంగా కొనసాగుతోంది. శివరాజ్ సింగ్ చౌహాన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యోగీ ఆదిత్యనాథ్‌ను ఆదర్శంగా తీసుకుని బుల్డోజర్లతో విచ్చలవిడిగా ఇళ్లు కూల్చేశారు. మధ్యప్రదేశ్‌లో 70 దుకాణాలు కూల్చేస్తే అందులో 50 హిందువులవేనని సోలిసిటర్ జనరల్ వాదించారు. నిజమే కావచ్చు. అయినా అక్రమ నిర్మాణాలను మినహా ఏదో నేరానికి ఇళ్లు కూల్చేయడం ఏ రకంగానూ న్యాయం అనిపించుకోదు. ఇది న్యాయస్థానాల ప్రమేయం లేకుండా న్యాయం చేస్తున్నట్టు నటించడమే. ఒక వ్యక్తి నేరం చేశాడనుకున్నా, లేక అలాంటి ఆరోపణ ఉన్నా ఒక వ్యక్తికి చెందిన ఇంటిని కూల్చేయడం అంటే చట్టం మీద బుల్డోజర్ నడపడమే అని గత వారమే సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. కూల్చివేతలకు మార్గదర్శకాలు రూపొందిస్తామని సుప్రీంకోర్టు గత రెండవ తేదీనే స్పష్టం చేసింది. జైపూర్‌లో ఒక ఇంటి యజమాని కొడుకు తనతో కలిసి చదువుకునే మరో వ్యక్తిని కత్తితో పొడిచాడని ఆ కుర్రోడి ఇంటిని కూల్చేశారు. ఆ ఇల్లు పొడిచిన కుర్రాడిది కాదు అన్న ఇంగితం కూడా ప్రభుత్వానికి లేదు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ అయితే బుల్డోజర్ ఉపయోగించి ఇల్లు కూల్చేయడానికి "గుండె ధైర్యం" ఉండాలన్నారు. ఆయన దృష్టిలో గుండె ధైర్యం అంటే కర్కశత్వం, చట్టాన్ని ఖాతరు చేయకపోవడం కావొచ్చు. జనాన్ని భయపెట్టడానికి, ప్రతిపక్షం గొంతు నొక్కడానికి బుల్డోజర్ ఆయుధం అయిపోయింది. తెలంగాణలోనూ కాంగ్రెస్ నాయకుడు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరవాత చెరువులను, కుంటలను ఆక్రమించుని కట్టిన ఇళ్లను కూల్చేస్తున్నారు. ఇందులో రేవంత్ ప్రభుత్వం లక్ష్యం ఏమైనా కావొచ్చు. అంతకు ముందు కె. చంద్రశేఖర్ రావు ప్రభుత్వం ఉన్నప్పుడూ చెరువులను ఆక్రమించినచోట ఇళ్లను కూల్చేయడానికి ప్రయత్నం జరిగింది. అయితే ఎందుకో ఆ ప్రభుత్వం వెనక్కు తగ్గింది. చెరువులను ఆక్రమించుకుని కట్టిన ఇళ్లను కూల్చేయడానికి రేవంత్ ప్రభుత్వం "హైడ్రా" అనే ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసింది. ప్రసిద్ధుల ఇళ్లనూ కూల్చేశారు. తేడా ఏమిటంటే తెలంగాణలో, ప్రధానంగా హైదరాబాద్‌లో చెరువులకు పూర్వరూపం తీసుకు రావడానికే అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్నారు తప్ప నేరాలకు శిక్షగా బుల్డోజర్లు వినియోగించడం లేదు.

వాటా చెల్లింపుల్లోనూ మొండి చేయి

పి. శ్రీకుమారన్

కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే సెస్‌లు, సర్‌చార్జీలపై పరిమితితో పాటు రాష్ట్రాలకు న్యాయమైనవాటా ఇవ్వాలని ఐదు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశం డిమాండ్ చేసింది. ఈ నెల 12న కేరళలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం తిరువనంతపురంలో నిర్వహించిన ఈ సమావేశంలో తమిళనాడు, తెలంగాణ, కర్నాటక, పంజాబ్‌ల ఆర్థిక మంత్రులు పాల్గొన్నారు. కేంద్ర-రాష్ట్రాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమతుల్యతలు, సంబంధాలపై ఈ రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బీజేపీయేతర పాలనలో ఉన్న ఈ ఐదు రాష్ట్రాల ఆర్థిక మంత్రులు

రాష్ట్రాల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని, అందరికీ కేంద్ర ప్రాయోజిత పథకాలలో ఒకే ప్రమాణం పాటించాలని సెస్‌లు, సర్‌ఛార్జీలపై పరిమితి విధించాలని డిమాండ్ చేశారు,

ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, 16వ ఆర్థిక సంఘం సిఫార్సులను రూపొందించే క్రమంలో పెరుగుతున్న సెస్సులు, సర్‌చార్జీలపై ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వసూలుచేసే పన్నులలో రాష్ట్రాలకు అధిక వాటా ఇవ్వాలనే రాష్ట్ర ఆర్థికమంత్రుల డిమాండ్‌ను సమర్థిస్తూ "గత దశాబ్దకాలంగా పెరుగుతున్న సర్‌ఛార్జ్‌లు, సెస్‌లు కేంద్ర స్థూల పన్ను ఆదాయంలో ఐదవ వంతు ఉన్నాయని, దాని పర్యవసానమే పన్నుల వాటా కుంచించుకుపోవడం"గా పినరయి వ్యాఖ్యానించారు. 16వ ఆర్థిక సంఘం పన్ను పంపిణీపై నిర్ణయం తీసుకోవడంలో తగిన శ్రద్ధ వహించాలని, అవసరమైన రాష్ట్రాలకు గ్రాంట్లు పంపిణీ చేయడానికి ఆర్టికల్ 275 రాజ్యాంగ నిబంధనల ప్రకారం, పన్నుల పంపిణీలో తీవ్రమైన భద్రతను పాటించాలని సమావేశం కోరింది. తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, పటిష్టమైన, నిజమైన సమాఖ్య వ్యవస్థను పాటించాలని కేంద్ర-రాష్ట్రాల అధికార సమతుల్యతను అనుసరిస్తూ, సమాఖ్య వ్యవస్థను అమలు చేయాలి.

రాష్ట్రాల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాల్సిన అవసరాన్ని తమిళనాడు ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు నొక్కి చెప్పారు. ఫైనాన్స్ కమిషన్లు తమిళనాడుకు పదేపదే జరిమానాలు విధించిందని ఎత్తి చూపారు. 15వ ఫైనాన్స్ కమిషన్ క్రింద తమిళనాడు రాష్ట్ర వాటా 7.93 నుండి 4.07 శాతానికి పడిపోయిందని పేర్కొన్నారు. కర్నాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరే గౌడ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విధించే సెస్‌లు, సర్‌చార్జీలను స్థూల పన్ను ఆదాయంలో ఐదు శాతానికి పరిమితం చేయాలని 16వ ఆర్థిక సంఘాన్ని కోరారు. పంజాబ్ ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (జిఎస్‌టి)ని ప్రవేశపెట్టడం దేశ సంస్కరణల్లో మైలురాయిగా అంగీకరిస్తూనే, ఇది రాష్ట్రాల ఆర్థిక స్వయంప్రతిపత్తిని తీవ్రంగా తగ్గించిందని అన్నారు. సహకార ఫెడరల్ వ్యవస్థ పెను సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని సదస్సుకు అధ్యక్షత వహించిన కేరళ ఆర్థిక మంత్రి కెఎన్ బాలగోపాల్ అభిప్రాయపడ్డారు. ఇది ఎక్కువగా "అప్రధానమైన ఫెడరల్ వ్యవస్థ'"గా మారుతోందన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని ఆర్థికమంత్రులు హెచ్చరించారు.

లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే "రాజకీయ ముప్పు" గా తెలంగాణ మంత్రి పేర్కొన్నారు. జనాభా నియంత్రణ, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చిన రాష్ట్రాలపై కేంద్రం అక్రమంగా పన్నులు విధిస్తోందని, అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు లోక్‌సభలో అసమాన ప్రాతినిధ్యం పొందుతున్నాయన్నారు. తెలంగాణ వ్యక్తం చేసిన ఆందోళనలతో కర్ణాటక ఏకీభవించింది. కేంద్రానికి ఒకవైపు దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక సహకారం పెరుగుతుండగా, మరోవైపు వారి రాజకీయ ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందని ఇది ఆమోదయోగ్యం కాదని ఈ అంశంపై దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంతో తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజాస్వామ్యాన్ని హరించే మితవాదం

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

ప్రపంచమంతా మితవాదశక్తులు విజృంభించాయి. ఫాసిస్టు తరహా శక్తులు, కొన్ని దేశాలలో, ముఖ్యంగా యూరోపియన్ యూనియన్ దేశాలలో అధికారాన్ని సాధించాయి. ప్రచ్ఛన్న యుద్ధానంతరం 'పెట్టుబడి' కి స్వేచ్ఛ లభించింది. తీవ్ర సామాజిక సంక్షోభాలు తలెత్తాయి. ఫలితంగా, మితవాద, నియంతృత్వ రాజకీయశక్తులు ఆవిర్భవించి, ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించాయి. భారతదేశం దీనికి మినహాయింపు కాదు. ఫాసిస్టు శక్తులు రాజ్యవ్యవస్థలపై పట్టును సాధించాయి. నరేంద్రమోదీ చిన్నతనం నుంచే ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులు. ఆయనే ప్రధానమంత్రిగా ఉన్నారు. హిందుత్వ రాజకీయ ప్రస్థానంలో ఇదొక ముఖ్యమైన ఘట్టం. ఆర్‌ఎస్‌ఎస్ ఒక హిందూ జాతీయ పారా మిలిటరీ సంస్థ. 1925 సెప్టెంబర్ 27వ తేదీ నాగపూర్‌లో ఆవిర్భవించింది. ఆ తర్వాత మూడు మాసాలకు భారత కమ్యూనిస్టుపార్టీ ఆవిర్భవించింది. ఆర్‌ఎస్‌ఎస్‌కు భారత స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న చరిత్ర లేదు. 'ద్విజాతి' సిద్ధాంతాన్ని ముందుకుతెచ్చి దేశవిభజనకు కారణమైంది. ముస్లిం వ్యతిరేక మతవిద్వేషాలు రెచ్చగొట్టి దేశంలో మత మారణహోమం సృష్టిస్తోంది. తనకు అనుబంధంగా తొలుత జనసంఘ్, ఆ తర్వాత భారతీయ జనతా పార్టీని నిర్మించుకుంది. ఈ పార్టీలు గుత్తపెట్టుబడిదారుల, బడా కార్పొరేట్ శక్తుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాల రక్షణకు నిలిచాయి. ఆర్‌ఎస్‌ఎస్ మార్గదర్శకత్వంలో దేశంలో హిందుత్వ రాజ్యస్థాపనకు బీజేపీ నడుం బిగించింది. రథయాత్రలు, మసీదుల విధ్వంసం, బాంబు పేలుళ్లు, ముస్లిం, క్రిష్టియన్, ఆదివాసీలు, దళితులపై దాడులు వారి నిత్య కార్యకలాపాలలో భాగమయ్యాయి. మత ప్రాతిపదికపై సమాజాన్ని చీల్చే చర్యలకు పాల్పడింది. గుజరాత్‌లో మోదీ ప్రభుత్వం వేలమంది ముస్లిం మైనారిటీలపై మారణకాండ చేపట్టింది. కేంద్రంలో గత పది సంవత్సరాలుగా పాలకపార్టీగా కొనసాగుతోంది. మహాత్మాగాంధీ హత్యతో 1948 నుంచి ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచదృష్టిని ఆకర్షించింది. కానీ ప్రజల్లో వ్యతిరేకతను పెంచుకుంది. అనేకసార్లు నిషేధాలకు గురైంది. తనకుతాను ఒక సాంస్కృతిక సంస్థగా ప్రకటించుకుంది. రాజకీయాలు తన పనికాదని కూడా ప్రకటించింది. మత విభజన, భావోద్వేగాలు రెచ్చగొట్టి, దొరికిన ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుని తిరిగి పుంజుకుంది.

ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత స్ఫూర్తి: కమ్యూనిస్టులది విదేశీ సిద్ధాంతమని ఆర్‌ఎస్‌ఎస్ తెగ ప్రచార చేస్తుంటుంది. తమది స్వచ్ఛమైన స్వదేశీ సిద్ధాంతమని నమ్మబలుకుతోంది. కానీ, దాని స్ఫూర్తి దాత యూరోపియన్ ఫాసిస్టు సిద్ధాంతమన్న వాస్తవాన్ని మరుగునపరిచే ప్రయత్నం చేస్తుంటుంది. ఫాసిస్టు నేతలు అడాల్ఫ్ హిట్లర్, ముసోలినీ తమ దేశాల్లో అనుసరించిన విధానాల పునాదులపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, దాని నిర్మాణం రూపొందించారు. జాతుల సమస్యపై హిట్లర్, ముసోలిని చూపించిన తుది పరిష్కారాలపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత గోల్వాల్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రముఖ చరిత్రకారులు రామచంద్ర గుహ "ప్రభుత్వంపై నిరసన తెలిపేవారు ప్రభుత్వాన్ని ఫాసిస్టు ప్రభుత్వం అనకుండా జాగ్రత్తపడాల"ని సలహా ఇచ్చారు. సంఘ్ పరివార్ వృద్ధి క్రమాన్ని పరిగణనలోకి తీసుకోలేదనీ, వారు మొదటగా ఇటాలియన్



కమ్యూనిస్టులది విదేశీ సిద్ధాంతమని ఆర్‌ఎస్‌ఎస్ తెగ ప్రచార చేస్తుంటుంది. తమది స్వచ్ఛమైన స్వదేశీ సిద్ధాంతమని నమ్మబలుకుతోంది. కానీ, దాని స్ఫూర్తి దాత యూరోపియన్ ఫాసిస్టు సిద్ధాంతమన్న వాస్తవాన్ని మరుగునపరిచే ప్రయత్నం చేస్తుంటుంది. ఫాసిస్టు నేతలు అడాల్ఫ్ హిట్లర్, ముసోలినీ తమ దేశాల్లో అనుసరించిన విధానాల పునాదులపై ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం, దాని నిర్మాణం రూపొందించారు. జాతుల సమస్యపై హిట్లర్, ముసోలిని చూపించిన తుది పరిష్కారాలపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత గోల్వాల్కర్ ప్రశంసలు కురిపించారు. ప్రముఖ చరిత్రకారులు రామచంద్ర గుహ "ప్రభుత్వంపై నిరసన తెలిపేవారు ప్రభుత్వాన్ని ఫాసిస్టు ప్రభుత్వం అనకుండా జాగ్రత్తపడాల"ని సలహా ఇచ్చారు.

ఫాసిజానికీ, ఆతర్వాత జర్మన్ నాజీలకూ అనుచరులనీ, వారి పార్టీకి విధేయులై ఉండే పారామిలిటరీ దళాలు, గోరక్షక దళాలు, భజరంగ్ దళ్, ఏబీవీపీ లాంటి హింసాత్మక మూకలపై ఆధారపడిన ఉద్యమంతో ఫాసిస్టు పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రముఖ చరిత్రకారులు బెంజమన్ జకారియా సమాధానమిచ్చారు. ఇటువంటి హింసాత్మక శక్తులపట్ల కటువుగా వ్యవహరించాల్సిందేనని ఆయన హెచ్చరించారు. ఇప్పటికీ వారివి ఫాసిస్టు చర్యలు కాదనిచేసే వాదనలను తిప్పికొట్టటానికి ఉదాహరణలెన్నయినా చెప్పవచ్చున"ని జకారియా అన్నారు. సంఘ్ పరివార్ చర్యలు ఫాసిస్టా కాదా అనే చర్చ ఎలావున్నా భారతదేశాన్ని నియంతృత్వ పాలన కిందకునెట్టే ప్రయత్నాలను అందరూ ఐక్యంగా ప్రతిఘటించాల్సి వుంది. పూర్తిస్థాయి ఫాసిజం రావటం, దాన్ని గుర్తించటం జరిగే వరకూ ఎదురుచూస్తూ, చేతులు ముడుచుకు కూర్చుంటే జరగాల్సిన నష్టం భారీగానే జరిగి తీరుతుంది.ఏకవ్యక్తి పాలన దేశానికి ఉపయుక్తమైనదని మన హిందూత్వ వాదులు భావించటం యాదృచ్ఛికం కాదు. సమాజం "మిలిటరీకరణ" జరగాలన్న ఫాసిస్టు సిద్ధాంతం హిందు మిలిటెంట్ నేషనలిస్టులను బాగా ఆకర్షించింది. ఫాసిస్టు ఇటలీ, నాజీ జర్మన్‌ల రాజకీయ వాస్తవికతను, తమకు అందివచ్చిన విదేశీ స్ఫూర్తి సంపద్వంతమైన మూలంగా హిందూత్వవాదులు భావించారు. దేశంలో గుజరాత్ లాంటి రాష్ట్రాలలో ముసోలినీ, హిట్లర్ల జీవిత చరిత్రలు పాఠ్యాంశాలుగా చేర్చటం యాదృచ్ఛికం కాదు. ఇవే పద్ధతులతో, ఇటాలియన్ ఫాసిస్టు తరహాలో, మూసలాగా ఆర్‌ఎస్‌ఎస్ ను నిర్మించటంలో కరుడుకట్టిన ఛాందసవాది, హెడ్గేవార్ గురువు బీఎస్ మూంజె ముఖ్యభూమిక పోషించారు. అందువల్లనే ఆర్‌ఎస్‌ఎస్ సంస్థాగత నిర్మాణం ఫాసిస్టు సంస్థలను పోలివుండటం కొట్టొచ్చినట్లు కన్పిస్తుంది.

ముసోలినీ, హిట్లర్ల లాంటి నియంతలు అవసరమట: దేశమంతటా, హిందూయిజాన్ని ప్రామాణీకరించేందుకు హిందూ ధర్మశాస్త్రం ఆధారంగా ఒక పథకం తన దగ్గర ఉన్నట్లు మూంజె ఒక అంతర్గత చర్చలో వెల్లడించారు. కానీ హిట్లర్, ముసోలినీ లాంటి నియంతల సారథ్యంలో సొంత రాజ్యం లేకుండా ఆ లక్ష్యం నెరవేరబోదని కూడా ఆయన చెప్పారు. అయితే, అటువంటి నియంత ఆవిర్భవించే వరకూ చేతులుముడుచుకుని కూర్చోవడం సాధ్యం కాదని కూడా ఆయన కుండబద్దలు కొట్టారు. బహుశా, మోదీ ప్రధాన మంత్రి కావడంతో ఆ కొరత తీరి ఉంటుంది. " రాష్ట్రీయ స్వయం సేవక్" అనే పేరుతో బ్రిటిష్ ఇంటెలిజెన్స్ 1933లో ఒక నివేదిక ప్రకటించింది. ఆర్‌ఎస్‌ఎస్, మూంజెకు ఫాసిస్టులతో గల సంబంధాలను ఆ నివేదికలో వివరించింది. అప్పటికే మిలిటెంట్ హిందుత్వ ప్రారంభమై, రూపుదిద్దుకుంటున్నట్లు ఆ గూఢచారి నివేదిక తెలిపింది. దేశంలో సైనిక విద్యను అభివృద్ధి పరచటం, హిందూసమాజాన్ని సైనికీకరించడం, మిలిటెంట్ హిందుత్వను బలోపేతం చేయటం అనే లక్ష్యాల సాధనకోసం మూంజె కృషిచేశారు. ఆ దిశగా అనేక లక్ష్యాలను వారు సాధించారు.

మెజారిటీ ప్రజల జాతి: ఏ దేశంలోనైనా, 'జాతి' అనేది మెజారిటీ ప్రజలతోనే ఏర్పడుతుందనీ, జర్మనీలో మైనారిటీగా ఉన్నందువల్లనే యూదులను జర్మనీ నుంచి గెంటేశారనీ గోల్వాల్కర్ సమర్థించారు. జర్మన్లకు జాతీయఉద్యమం ఉందనీ, కానీ యూదులే మత ఉద్యమాలను నడిపారన్న విమర్శనాస్త్రాన్ని సంధించారు. మొత్తం యూదుజాతిని మట్టుపెట్టిన జర్మన్ నాజీలకు గోల్వాల్కర్ ప్రశంసల జల్లు కురిపించారు. ఈ స్ఫూర్తితో, ముస్లింలు విదేశీయులుగా ఉండటాన్ని విరమించుకోవాలనీ, హిందూజాతికిలోబడి సహాయకులుగా ఉండాలనీ, పౌరసత్వ హక్కులతో సహా ఏ హక్కునూ లేదా ప్రయోజనాన్నీ కోరరాదనీ గోల్వాల్కర్ తన 'ముస్లిం' విద్వేషాన్ని బహిర్గతం చేశారు. ఈ సైద్ధాంతిక పునాదులపైనే, "హిందుత్వ" రాష్ట్ర సాధనకోసం ఆర్‌ఎస్‌ఎస్ గత తొమ్మిది దశాబ్దాలుగా తన ప్రణాళికలను అమలుచేస్తోంది. ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బీజేపీ 'హిందుత్వ' యజ్ఞంలో భాగంగానే తన అధికారాలను చలాయిస్తోంది. ఇటలీ ఫాసిజం, జర్మన్ నాజీజంలే సంఘ్ పరివార్‌కు స్ఫూర్తినీ, ఉత్సాహాన్ని అందించాయి. 'మీ ఫాసిజాన్ని ముందుకు సాగనివ్వం' అనే హెచ్చరికను పంపాల్సిన అవసరం నేడెంతైనా ఉంది. అందుకోసం దేశంలోని యావత్ లౌకిక, ప్రజాస్వామికశక్తులు ఏకం కావాలి. అదొక్కటే ఏకైక మార్గం.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్ 94909193263

రాహుల్‌పై బీజేపీ అక్కసు

కళ్యాణి శంకర్

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అమెరికా పర్యటన విజయవంతంకావడంతో బీజేపీలో తీవ్రమైన ఆందోళన ఏర్పడింది. గంగవెర్రులెత్తిన బీజేపీ నాయకులు రాహుల్‌పై విరుచుకుపడుతున్నారు. రాహుల్ భారతదేశ ప్రతిష్ఠను దెబ్బతీశారని మాట్లాడుతున్నారు. 2014 నుంచి ప్రధాని నరేంద్ర మోదీ దాదాపు 80దేశాలకుపైగా పర్యటించారు. అనేక దేశాలలో కాంగ్రెస్‌పైన వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహించారు. తొలినుంచి కాంగ్రెస్ అవినీతికి పాల్పడిందని ప్రచారం చేస్తూ, దేశప్రతిష్ఠను దెబ్బతీసిన అనేక అంశాలు ఉన్నాయి. నోటికి వచ్చినట్లుగా మాట్లాడటం బీజేపీ నాయకులకు బాగా అలవాటైంది. అమెరికాలో వివిధ సమావేశాలలో మాట్లాడిన రాహుల్‌గాంధీ సభకు హాజరైన వారి నుంచి ప్రశంసలు అందుకున్నారు. మోదీ ప్రభుత్వ విధానాలతో ప్రజలు పడుతున్న కష్టాలను ఈ సందర్భంగా రాహుల్ వివరించారు. అమెరికా పర్యటన సందర్భంగా భారతదేశాన్ని గురించి చెప్పిన మాటల్లో రాహుల్ హద్దులు దాటినట్లుగా బీజేపీ చెబుతోంది. కాంగ్రెస్ మాత్రం రాహుల్ అలాంటి పనిచేయలేదని చెపుతోంది. ప్రధాని మోదీ అనుసరిస్తున్న వినాశకర విధానాలను రాహుల్ తూర్పారపట్టారు. ఇతర దేశాల్లో కాంగ్రెస్‌ను అవమానిస్తూ మాట్లాడటం మోదీగా బాగా అలవాటైంది. రాహుల్ ప్రసంగంలోనూ, ప్రకటనల్లోనూ ఎలాంటి తప్పులు లేకపోయినా ఆయన ప్రసంగాలలో చెప్పని విషయాలను మోదీ పేర్కొంటున్నారు. మాట్లాడని అంశాలను కూడా లేవనెత్తి విమర్శలు గుప్పిస్తున్నారు. అమెరికాలో నివసిస్తున్న

భారతీయులు, విద్యార్థులు, అధికారులు, చట్టసభల సభ్యుల సమావేశంలో మాట్లాడి అందరినీ ఆకట్టుకున్నారు. వ్యూహాత్మకంగా మాట్లాడిన అంశాలపై కూడా రాహుల్ హద్దులు దాటారని మోదీ అంటున్నారు.

మోదీ ఏ దేశంలో పర్యటించినా అక్కడ నివసిస్తున్న భారతీయులను కలుసుకుని మాట్లాడారు. కాంగ్రెస్‌పైన విమర్శలు గుప్పించారు. అధికారిక పర్యటనలో అక్కడి భారతీయులను కలుసుకోవడమేమిటి? అని అనేక ప్రశ్నలు ఎదురయ్యాయి. మోదీ ఏ విమర్శలను పట్టించుకోరు. తాను చేపట్టే తప్పుడు విధానాలను మార్చుకోరు. అమెరికాలో నివసిస్తున్న భారతీయులతో మంచి సంబంధాలను ఏర్పరుచుకోడానికి తాను వివిధ సమావేశాల్లో మాట్లాడానని రాహుల్ వివరించారు. ఆర్‌ఎస్‌ఎస్ భారత్‌లో ప్రజాస్వామ్యానికి అపఖ్యాతి తెచ్చింది. ప్రజాస్వామ్యాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఖాతరు చేయలేదు. మోదీ సైతం ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడానికే పూనుకున్నారు. అయన చైనాపై అనుసరిస్తున్న విధానాన్ని, భారత్‌లో మతస్వేచ్ఛను, పౌరహక్కులను హరించారని రాహుల్ తన ప్రసంగంలో చెప్పారు. ఇండియా-అమెరికా ప్రజల ప్రభావం గణనీయంగా పెరిగింది. దశాబ్ది క్రితం భారత్, అమెరికా పౌరుడు ఒక్కరు మాత్రమే ప్రతినిధుల సభలో ఉన్నారు. ఇప్పుడు ప్రతినిధుల సభలో ఐదుగురు, సెనేటర్‌గా ఒకరు భారతీయ మూలాలు కలిగిన వారు ఉన్నారు. త్వరలో జరగనున్న అధ్యక్షపదవికి పోటీచేస్తున్న కమలా హారిస్ భారతీయ మూలాలు గలిగిన వనిత. అమెరికా రిపబ్లికన్ పార్టీ ప్రతినిధిగా, ఉపాధ్యక్షుడుగా పోటీ చేస్తున్న జేడీ వాన్స్ సతీమణి. భారతీయురాలు. అమెరికాలో భారత్ నుంచి వెళ్లి చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఐటీకంపెనీలలో పనిచేస్తున్న భారతీయులు అనేక వేలమంది ఉన్నారు. అమెరికా ప్రజలలో దాదాపు 1శాతం భారతీయులు ఉన్నారని రాహుల్ అన్నారు. అమెరికా కాంగ్రెస్‌లో సైతం 1శాతం భారతీయ మూలాలు కలిగినవారు ఉన్నారని, ఈ విధంగా భారతీయ ప్రభావం అమెరికాలో గణనీయంగా పెరిగిందని రాహుల్ అన్నారు.

బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ భారత్ పట్ల ఒకేభావాన్ని కలిగి ఉంది. హిందురాష్ట్ర ఏర్పాటు దాని ప్రధాన లక్ష్యం. కాంగ్రెస్ మాత్రం బహుళ భావజాలాన్ని నమ్ముతుంది. బీజేపీ వెనుకున్న ఆర్‌ఎస్‌ఎస్ సంకిష్టమైన భావజాలాన్ని కలిగి ఉన్నదని రాహుల్ చేసిన విమర్శపై బీజేపీ నాయకులు బెంబేలెత్తారు. తమపైన రాహుల్ ప్రతికూల వ్యాఖ్యలు చేశారని బీజేపీ కాంగ్రెస్‌ను దుయ్యబట్టింది. అమెరికా కాంగ్రెస్‌లో భారతదేశ వ్యతిరేక భావజాలం కలిగిన వనిత ఇహాన్ ఒమర్‌ని రాహుల్ కలిశారని బీజేపీ విరుచుకుపడింది. రాహుల్ మన దేశానికి వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తున్నారని బీజేపీ పేర్కొంటోంది. ఇహాన్ ఒమర్‌ను ప్రత్యేకంగా కలవలేదని, చట్టసభల సభ్యుల బృందంలో ఆమె ఉన్నారని, ఆ బృందంతో మాత్రమే మాట్లాడానని రాహుల్ తెలియజేశారు. గత 10 సంవత్సరాలుగా మోదీ ప్రభుత్వంలో భారతదేశ ప్రజాస్వామ్యం అతలాకుతలమైంది. దేశంలో 90శాతం మంది ఓబీసీలు, దళితులు, ఆదివాసీలు ప్రజాస్వామ్యంలో క్రియాశీలపాత్రను నిర్వహించడంలేదు. ఇందుకు ప్రధానకారణం బీజేపీ ప్రభుత్వమేనని రాహుల్ చేసిన వ్యాఖ్యలనూ బీజేపీ తప్పుపట్టింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్ పట్ల మోదీ అనుసరిస్తున్న విధానాలను రాహుల్ సమ్మతించారు. మోదీ చైనాపట్ల అనుసరిస్తున్న విధానాలు లోపభూయిష్టంగా ఉన్నాయన్నారు. లదాక్‌లో దిల్లీ విస్తీర్ణమంత ప్రాంతాన్ని చైనా ఆక్రమించుకున్నప్పటికీ మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఇది అత్యంత సిగ్గుచేటని అన్నారు. భారతదేశ గౌరవాన్ని తుంగలోతొక్కారని రాహుల్ విమర్శించారు. కులగణనపై రాహుల్ మాట్లాడటాన్ని బీజేపీ విమర్శించింది. చైనా విధానాన్ని విమర్శించడంపై రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కులగణనను రాహుల్ సమర్థించగా, దాన్ని వ్యతిరేకించిన బీజేపీ రిజర్వేషన్ల అంతానికి ప్రయత్నిస్తున్నారని రాహుల్ విమర్శించారు. ఇటీవల ఆర్‌ఎస్‌ఎస్ కులగణనకు సానుకూలత వ్యక్తం చేసింది. బీజేపీ కులగణనకు అనుకూలంగా ఉన్నదీ లేనిదీ స్పష్టంగా ప్రకటించలేదు. అయితే ఇదే అంశంపై కేంద్ర హోంమంత్రి స్పందిస్తూ రిజర్వేషన్లను రద్దు చేసేందుకు తాము అనుమతించబోమని అన్నారు. కాంగ్రెస్ నుంచి భారతదేశాన్ని విముక్తి చేస్తామని మోదీ పదేపదే మాట్లాడారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఆశ్చర్యపడే విధంగా కాంగ్రెస్ సభ్యుల సంఖ్య రెట్టింపైంది. అదే సమయంలో ఇండియా ఐక్యసంఘటన ఈ ఎన్నికల్లో బలోపేతమైంది. రెండు ప్రాంతీయ పార్టీల సహాయంతో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. రాహుల్ చివరి సమావేశంలో ప్రసంగిస్తూ భారతదేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు భారతీయులే పోరాడాల్సి ఉందని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య రక్షణకు తాము అంకితమై ఉన్నామని తప్పనిసరిగా సాధిస్తామని రాహుల్ అన్నారు.

బాలికపై సామూహిక అత్యాచారం

సహర్సా: కదులుతున్న కారులో ఓ టీనేజ్ బాలికపై దారుణం చోటుచేసుకుంది. తుపాకీ గురిపెట్టి బెదిరించిన ముగ్గురు దుండగులు... ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన బీహార్‌లోని సహర్సా జిల్లాలో ఈనెల 14న చోటుచేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై ఎస్పీ హిమాన్షు మాట్లాడుతూ 'ఈ నెల 14న సాయంత్రం ఈ దారుణం చోటుచేసుకోగా... బాలిక సోమవారం సదర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశాం. దీనిపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి... బాధితురాలిని వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించాం. ఇంకా నివేదిక రావాల్సి ఉంది. ఈ వ్యవహారంలో ఒకరిని అరెస్టు చేయగా... మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నాం. తుపాకీతో బెదిరించారా? లేదా? అనే అంశంతో పాటు అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నాం. నిందితులు ఉపయోగించిన కారును సీజ్ చేశాం' అని తెలిపారు.

కోల్‌కతా కొత్త పోలీస్ కమిషనర్‌గా మనోజ్ వర్మ

కోల్‌కతా: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వైద్యులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సోమవారం రాత్రి చర్చలు జరిపిన అనంతరం ఆందోళనకారుల డిమాండ్ మేరకు కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ వినీత్ గోయల్‌పై వేటు పడింది. నూతన కమిషనర్‌గా మనోజ్ కుమార్ వర్మను నియమిస్తూ మమత సర్కారు మంగళవారం నిర్ణయం తీసుకుంది. వినీత్‌ను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అదనపు డైరెక్టర్ జనరల్ (ఏడీజీ)గా బదిలీ చేస్తున్నట్లు వెల్లడించింది. కోల్‌కతా కమిషనర్‌గా ఉన్న వినీత్ గోయల్... మమతా బెనర్జీకి నమ్మకస్థుడనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆయనను పదవి నుంచి తొలగించాలని ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యులతో పాటు విపక్ష నేతలు కూడా డిమాండ్ చేశారు. దీంతో సోమవారం సాయంత్రం వైద్యులతో సీఎం చర్చలు జరిపారు. వైద్య విద్యార్థుల ఐదు డిమాండ్లలో మూడింటిని అంగీకరించినట్లు మమత పేర్కొన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కోల్‌కతా పోలీసు కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కౌస్తవ్ నాయక్, హెల్త్ సర్వీస్ డైరెక్టర్ దేవాశిష్ హల్దేర్‌లను తొలగిస్తానని మమత హామీ ఇచ్చారు. అందులో భాగంగా కోల్‌కతా పోలీసు కమిషనర్‌ను తప్పించారు.

బుల్డోజర్ న్యాయం రాజ్యాంగ విరుద్ధం: అఖిలేశ్

లక్నో: అక్టోబర్ 1 వరకూ దేశవ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా కోర్టు అనుమతి లేకుండా ఎలాంటి కూల్చివేతలు చేపట్టరాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయితే రహదారులు, ఫుట్‌పాత్‌ల వంటి బహిరంగం ప్రదేశాల్లో అనధికార నిర్మాణాలకు ఈ ఉత్తర్వులు వర్తించబోవని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో తదుపరి విచారణ జరిగే అక్టోబర్ 1 వరకూ దేశవ్యాప్తంగా బుల్డోజర్ల దూకుడుకు అడ్డుకట్ట పడనుంది. కాగా, సుప్రీంకోర్టు తీర్పును సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ స్వాగతించారు. బుల్డోజర్ కూల్చివేతలతో న్యాయం జరగదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని, బుల్డోజర్‌తో ప్రజలను భయపెట్టడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. విపక్షాల గొంతు నొక్కేందుకే ఉద్దేశపూర్వకంగా బుల్డోజర్‌ను తెరపైకి తీసుకొచ్చారని స్పష్టం చేశారు. బుల్డోజర్‌ను నిలువరించేలా సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలకు తాను సర్వోన్నత న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో బుల్డోజర్లు ఆగిపోతాయని, న్యాయస్థానం ద్వారా న్యాయం జరుగుతుందనే ఆశ చిగురించిందని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. పేదల పైనే బుల్డోజర్లు ప్రయోగిస్తున్నారని, పెద్దల ఆక్రమణలు, కబ్జాలపై బుల్డోజర్లు కన్నెత్తి చూడవని అన్నారు. బుల్డోజర్‌తోనే న్యాయం జరుగుతుందని సీఎం, యూపీ ప్రభుత్వం, కాషాయ నేతలు ప్రచారం చేస్తున్నారని అఖిలేశ్ మండిపడ్డారు.

నిరుద్యోగ సంక్షోభ పరిష్కారంలో విఫలం

- ఇప్పటికే అనేక యూ-టర్న్‌లు... వరుస కుంభకోణాలు
- మోదీ 3.0 వంద రోజుల పాలనపై కాంగ్రెస్ ధ్వజం

న్యూదిల్లీ : మోదీ 3.0 వంద రోజుల పాలన అనేక యూ-టర్న్‌లు తీసుకుందని, దేశంలో నిరుద్యోగ సంక్షోభం పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మంగళవారం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జి జైరాం రమేశ్ మాట్లాడుతూ 'జీవ రహిత ప్రధాన మంత్రి, అతని భజన చేసే 'ఆర్థిక వేత్తలు' నిరుద్యోగ వృద్ధి ఆలోచనపై స్థిరంగా దాడి చేశారు. అయితే 2014 నుంచి చూసిన 'నిరుద్యోగ నష్టం పెరుగుదల' వాస్తవికత బహుశా మరింత స్పష్టంగా ఉంది' అని తెలిపారు. 'నిన్నటితో ఈ అస్థిరమైన, సంక్షోభంతో నిండిన ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకుంది. యూ-టర్న్‌లు, వరుస కుంభకోణాల నడుమ భారతదేశ సామూహిక నిరుద్యోగ సంక్షోభంపై చర్య తీసుకోవడంలో ప్రభుత్వం మళ్లీ విఫలమైంది. గత ఐదేళ్లుగా కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యపై నిరంతరం హెచ్చరిస్తూ వస్తోంది' అని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగాలు సృష్టించే ఎంఎస్‌ఎంఈలను నాశనం చేయడం, జీఎస్‌టీని హడావుడిగా అమలు చేయడం, ప్రణాళిక లేని కోవిడ్-19 లాక్‌డౌన్, చైనా నుంచి పెరుగుతున్న దిగుమతుల వల్ల ఈ సంక్షోభం ప్రభుత్వం స్వంతంగా సృష్టించిందని చెప్పారు. 'చివరకు బడా కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉండే జీవయేతర ప్రధాన మంత్రికి చెందిన ఆర్థిక విధానం. భారతదేశ నిరుద్యోగిత రేటు నేడు 45 సంవత్సరాలలో అత్యధికంగా ఉంది. గ్రాడ్యుయేట్ యువతలో నిరుద్యోగం రేటు 42 శాతం ఉంది' అని ఆయన తెలిపారు. ఈ సంక్షోభం వృద్ధిని రుజువు చేసే వివరాలు సమృద్ధిగా ఉన్నాయని, రెండు హేయమైన పోకడలు... తగినంత ఉపాధిని సృష్టించడంలో వైఫల్యం, అధికారిక వేతన ఉద్యోగాలను కుదించడం' అని జైరాం రమేశ్ చెప్పారు. 'అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) భారతదేశ ఉపాధి నివేదిక-2024... ప్రతి సంవత్సరం 70-80 లక్షల మంది యువకులు శ్రామిక శక్తిలోకి వస్తున్నారు. కానీ 2012-2019 మధ్య ఉపాధిలో దాదాపు సున్నా వృద్ధి... కేవలం 0.01' శాతం అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అన్నారు. అదే నివేదిక ప్రకారం 2022లో పట్టణ యువత (17.2 శాతం), అలాగే గ్రామీణ యువత (10.6 శాతం) లో నిరుద్యోగం చాలా ఎక్కువగా ఉందని, పట్టణ ప్రాంతాల్లో మహిళా నిరుద్యోగిత రేటు 21.6 శాతం వద్ద చాలా ఎక్కువగా ఉందని ఆయన ఎత్తి చూపారు. మన యువతకు ఉపాధి కల్పించాలంటే వచ్చే పదేళ్లపాటు భారత్ ఏడాదికి 1.2 కోట్ల ఉద్యోగాలను సృష్టించాలని సిటీ గ్రూప్ నివేదిక అంచనా వేసింది. '7 శాతం జీడీపీ వృద్ధి కూడా మన యువతకు తగినంత ఉద్యోగాలను సృష్టించదు. జీవరహిత ప్రధాన మంత్రి ప్రభుత్వంలో మనం సగటున 5.8 శాతం జీడీపీ వృద్ధిని సాధించాం.

విఫలమైన మోదీ ఆర్థిక వ్యవస్థ నిరుద్యోగ సంక్షోభానికి మూల కారణం' అని ఆయన అన్నారు. అధికారిక వేతన ఉద్యోగాలను కుదించే అంశంపై ధ్వజమెత్తిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి... ఐఎల్‌వో నివేదికలో మోదీ ప్రభుత్వం సామాజిక భద్రత లేకుండా తక్కువ వేతనాలతో కూడిన అనధికారిక రంగ ఉద్యోగాల శాతాన్ని పెంచిందని, 2019-22 నుంచి అధికారిక ఉపాధి 10.5 శాతం నుంచి 9.7 శాతానికి తగ్గిందని తెలిపారు. సిటీగ్రూప్ అదే ధోరణిని ధ్రువీకరించింది. భారతదేశంలోని శ్రామిక శక్తిలో కేవలం 21 శాతం మంది మాత్రమే జీతంతో కూడిన ఉద్యోగం కలిగి ఉన్నారని, ఇది కోవిడ్‌కు ముందు 24 శాతం కంటే తక్కువగా ఉందని పేర్కొంది. కోవిడ్ తర్వాత రికవరీ కె-ఆకారంలో ఉంది. బిలియనీర్ తరగతి మాత్రమే లబ్ధిదారుడు. జీతాలు తీసుకునే మధ్య తరగతికి మార్గం కనుమరుగవుతోంది' అని ఆయన విమర్శించారు. 'దశాబ్దాలలో మొదటిసారిగా మోదీ అస్తవ్యస్త పాలనలో వ్యవసాయంలో పని చేసే వారి సంఖ్య పెరుగుతోంది. ఇది ఆర్థిక ఆధునీకరణ ప్రాథమిక భావనకు విరుద్ధంగా ఉంది' అని ఆయన అన్నారు. కార్మికులు కర్మాగారాల నుంచి తిరిగి పొలాలకు మారుతున్నారు. మొత్తం ఉపాధిలో వ్యవసాయం వాటా 2019-22 నుంచి 42 శాతం నుంచి 45.4 శాతానికి పెరిగిందని జైరాం రమేశ్ చెప్పారు. 'భారతదేశం దురదృష్టం ఏమిటంటే, జీవరహిత ప్రధాన మంత్రి, అతని ప్రభుత్వం ఈ వాస్తవాన్ని అంగీకరించడానికి నిరాకరిస్తున్నారు. బదులుగా అభివృద్ధి చెందుతున్న ఉద్యోగ మార్కెట్‌ను తమ ఘనతే అని చెప్పుకుంటున్నారు. ఆర్‌బీఐ కేఎల్‌ఈఎంఎస్ వివరాలను ఉపయోగించి ఆర్థిక వ్యవస్థ 80 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించిందని వాదిస్తున్నారని ఆయన మండిపడ్డారు. 'అయితే ఈ డేటా నిరుద్యోగాన్ని కొలవడానికి తగినది కాదని తగినంత, మరిన్ని ఆధారాలు వెలువడ్డాయి. వారు చెప్పుకుంటున్న 'ఉపాధి వృద్ధి'లో ఎక్కువ భాగం మహిళలు చేసే వేతనం లేని ఇంటి పనిని 'ఉపాధి'గా నమోదు చేస్తోంది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

మళ్లీ జరంగే దీక్ష

మరాఠా కోటాపై ఆరవసారి ఉద్యమం

ఛత్రపతి శంభాజీనగర్ : ఓబీసీ తరగతి కింద తమ సామాజిక వర్గానికి రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్న మరాఠా కార్యకర్త మనోజ్ జరంగే ఒక ఏడాదికి పైగా విరామం తర్వాత తిరిగి మంగళవారం తాజాగా నిరవధిక దీక్షను ప్రారంభించారు. ఇక్కడికి 75 కి.మీ దూరంలోని జల్నా జిల్లాకు చెందిన తన స్వస్థలమైన అంతర్వాలి సారతి గ్రామంలో అర్ధరాత్రి నుంచి ఆయన దీక్షను ప్రారంభించారు. తొలుత ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తమ సామాజిక వర్గానికి రిజర్వేషన్లు ఇవ్వలేదని ఆరోపించారు. కోటా సమస్యను పరిష్కరించడానికి మరాఠాలు ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు 'మరో అవకాశం' ఇస్తున్నారని జరంగే తెలిపారు. తమ సామాజిక వర్గ డిమాండ్లను నెరవేర్చకుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికార పార్టీలను హెచ్చరించారు. కుంబీలను మరాఠా సామాజికవర్గ సభ్యుల 'సేజ్ సోయారే' (రక్త సంబంధీకులు) గా గుర్తిస్తూ ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) కేటగిరీ కింద వారికి రిజర్వేషన్లు కల్పించే ముసాయిదా నోటిఫికేషన్‌ను అమలు చేయాలని జరంగే డిమాండ్ చేస్తున్నారు. గతంలో తన ఆందోళన సందర్భంగా మరాఠా వర్గానికి చెందిన అనేక మందిపై నమోదయిన కేసులను కూడా ఉపసంహరించుకోవాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. 'నాకు మరాఠా సమాజం ముఖ్యం. కానీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా రిజర్వేషన్లు ఇవ్వడం లేదు. పైగా, మేము రాజకీయ భాష మాట్లాడుతున్నామని వారు అంటున్నారు. ఇప్పుడు నేను ఇకపై రాజకీయ ప్రకటనలు చేయను. కానీ సమస్యను పరిష్కరించడానికి ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌కు మేము మరొక అవకాశం ఇస్తున్నాం' అని తెలిపారు. 'ఫడ్నవీస్‌కు మద్దతిచ్చే నేతలు ఆయనతో మాట్లాడాలి. రిజర్వేషన్లు ఎవరు కల్పిస్తారో సమాజం చూస్తోంది' అని అన్నారు. 'నా సామాజికవర్గం రాజకీయాల్లోకి రావాలని కోరుకోవడం లేదు. కానీ డిమాండ్లు నెరవేరకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జరిగే పరిణామాలకు నన్ను నిందించవద్దు. రిజర్వేషన్ ఇవ్వండి. నేను రాజకీయ ప్రకటనలు చేయను. కానీ నన్ను నిందించవద్దు. రిజర్వేషన్లు రాకుంటే వచ్చే ఎన్నికల్లో ఏం జరుగుతుందోనని' ఆయన అన్నారు.

బంగ్లాదేశ్‌తో సంబంధాలు కొనసాగిస్తాం: జైశంకర్

న్యూదిల్లీ: బంగ్లాదేశ్‌తో సత్సంబంధాలు కొనసాగించడంపై భారత విదేశాంగశాఖ మంత్రి ఎస్.జైశంకర్ స్పందించారు. బంగ్లాతో మునుపటిలా స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. అది రెండు దేశాలకు ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

ఓ జాతీయ మీడియా సంస్థకు మంగళవారం ఆయన ఇంటర్వ్యూలో ఇచ్చారు. బంగ్లాదేశ్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అక్కడి ప్రభుత్వంతో ద్వైపాక్షిక సంబంధాల కొనసాగింపుపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 'బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఏం జరిగినా అది వారి అంతర్గత వ్యవహారం. పొరుగుదేశాలు ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉండడం ఎంతో ముఖ్యం. భారత్ పొరుగుదేశాలతో సత్సంబంధాలు కొనసాగించాలని భావిస్తోంది. బంగ్లాతో స్నేహపూర్వక బంధాన్ని స్థిరంగా ఉంచాలనుకుంటున్నాం. వాణిజ్యపరంగా ఆ దేశంతో మంచి సంబంధాలున్నాయి. ప్రజల మధ్య ఆరోగ్యకరమైన బంధం కొనసాగుతోంది. దీన్ని ఇలాగే ముందుకుతీసుకెళ్లాలని భావిస్తున్నాం' అని పేర్కొన్నారు. కాగా..బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ ఇటీవల భారత్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఉన్న హసీనా రాజకీయ వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆమెను అప్పగించాలని బంగ్లా ప్రభుత్వం కోరేవరకు హసీనా మౌనంగా ఉండాలన్నారు. లేకపోతే ఆమె వ్యాఖ్యలు రెండు దేశాల సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరించారు.

భారత్‌తో తమ దేశం సత్సంబంధాలు కోరుకుంటోందని యూనస్ పేర్కొన్నారు. ఈ సంబంధం సమానత్వం, పారదర్శకంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. దీనిపై తాజాగా మీడియా అడిగిన ప్రశ్నకు జై శంకర్...బంగ్లాతో సత్సంబంధాలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

నాకూ సీఎం కావాలని ఉంది

అజిత్ పవార్

ముంబై: అసెంబ్లీ ఎన్నికలకు మహారాష్ట్ర సిద్ధమవుతోన్న వేళ ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్ కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం పదవిపై మౌనం వీడారు. తనకు సీఎం కావాలని ఉందని తన ఆసక్తిని బయటపెట్టారు. 'ప్రతిఒక్కరు తమ నాయకుడిని సీఎంగా చూడాలని అనుకుంటారు. ఎవరైనా సీఎం కావాలని అనుకుంటే... వారు మెజార్టీ నంబర్‌కు చేరుకోవాలి. ప్రతి ఒక్కరి ఆకాంక్షలు నెరవేరవు. ప్రతి ఒక్కరు వారు కోరుకున్నది పొందలేరు. అదంతా ఓటర్ల చేతిలో ఉంటుంది. 288 స్థానాలకుగానూ 145 సీట్లు దక్కించుకోవాలి' అని డిప్యూటీ సీఎం అజిత్ అన్నారు. దగ్దూషేట్ హల్వాయ్ గణపతి ఆలయంలో పూజల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న ఎన్నికలను తమ కూటమి (బీజేపీ, ఎన్‌సీపీ, శివసేన)... ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో ఎదుర్కోనుందని అజిత్ వెల్లడించారు. 'మా కూటమిని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు మేం ప్రయత్నిస్తున్నాం. అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా కలిసి చర్చించుకొని తదుపరి సీఎంను ఎంపిక చేసుకుంటాం' అని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏక్‌నాథ్ షిండేను ముఖ్యమంత్రి చేయాలంటూ శివసేన నేతలు డిమాండ్ చేస్తోన్న తరుణంలో పవార్ స్పందించడం గమనార్హం. దేవేంద్ర ఫడ్నవీస్‌ను మరోసారి సీఎం పీఠంపై కూర్చోబెట్టాలని బీజేపీ నేతలు కోరుకుంటున్నారు. మరోపక్క ప్రత్యర్థి వర్గం 'మహావికాస్ అఘాడీ (ఎంవీఏ)'లో కూడా సీఎం ఆశావహులు చాలామంది ఉన్నారు. సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించకుండానే అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లేందుకు ఆ కూటమి సన్నద్ధమవుతున్నది.

మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే మాట్లాడుతూ తనకు ముఖ్యమంత్రి కావాలనే కోరిక లేదన్నారు. కూటమిలో ఎవరిని సీఎం అభ్యర్థిగా నిలబెట్టినా మద్దతు ఇస్తానన్నారు. ఎంవీఏ తన సీఎం అభ్యర్థిని ప్రకటించాల్సిన అవసరం లేదని, ఏ పార్టీకి ఎక్కువ సీట్లు వస్తాయనే దాని ఆధారంగా సీఎం ఎవరనేది నిర్ణయిస్తామని ఎన్‌సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్ పవార్ గతంలో వ్యాఖ్యానించారు.

ఆతిశీడమ్మీ సీఎం

స్వాతి మాలీవాల్ విమర్శలు

న్యూదిల్లీ: దిల్లీ తదుపరి ముఖ్యమంత్రిగా ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు, మంత్రి అతిశీ ఎంపికపై ఆ పార్టీ రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆతిశీ'డమ్మీ సీఎం' అని మండిపడ్డారు. 'దిల్లీకి ఇది విచారకరమైన రోజు. ఉగ్రవాది అఫ్జల్ గురును కాపాడేందుకు యత్నించిన కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తికి ముఖ్యమంత్రి పగ్గాలు అప్పగించారు. అఫ్జల్ గురుకు ఉరిశిక్ష పడినప్పుడు... అతడిని రక్షించేందుకు ఆతిశీకుటుంబం సుదీర్ఘకాలం పోరాడింది. అతడు అమాయకుడని, రాజకీయ కుట్రకు బలయ్యాడని చెబుతూ క్షమాభిక్ష ప్రసాదించాలని అప్పటి రాష్ట్రపతికి విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు ఆతిశీ'డమ్మీ సీఎం' అయినప్పటికీ ఆమె ఎంపిక... దేశ భద్రతకు ఆందోళన కలిగించే అంశం' అని స్వాతి మాలీవాల్ తన 'ఎక్స్' ఖాతాలో రాసుకొచ్చారు. కాగా... స్వాతి మాలీవాల్ వ్యాఖ్యలపై ఆప్ నేత దిలీప్ పాండే తీవ్రంగా మండిపడ్డారు. ఆమె పార్టీని వీడాలని డిమాండ్ చేశారు. 'ఆప్ సభ్యురాలిగా ఆమె రాజ్యసభకు ఎన్నికయ్యారు. కానీ, ఇప్పుడు బీజేపీకి వంతపాడుతున్నారు. ఆతిశీఎంపిక నిర్ణయం ఆమెకు నచ్చకపోతే రాజ్యసభ ఎంపీగా రాజీనామా చేయాలి' అని పాండే విమర్శించారు.

రాహుల్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలా?

వారిపై చర్యలు తీసుకోండి: మోదీకి ఖర్గే లేఖ

న్యూదిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత, ఎంపీ రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. రాహుల్‌పై అభ్యంతరకరమైన, హింసాత్మక ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ప్రధానిని కోరారు. బీజేపీ, తమ అనుబంధ పార్టీల నేతలు ఉపయోగించే అసభ్యకరమైన భాష భవిష్యత్తు తరాలకు ప్రమాదకరమని ఖర్గే తెలిపారు. దీనిని ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి సంబంధించిన సమస్యగా పేర్కొన్నారు. 'బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మంత్రి... రాహుల్‌ను 'నంబర్ వన్ టెర్రరిస్ట్'గా పిలిచారు. మహారాష్ట్రలో మీ ప్రభుత్వంలోని కూటమి పార్టీకి చెందిన ఎమ్మెల్యే(శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్) రాహుల్ నాలుక కోస్తే రూ.11 లక్షల రివార్డు ప్రకటిస్తున్నారు. దిల్లీలోని ఓ బీజేపీ నేత... రాహుల్‌పై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నారు. భారత సంస్కృతి అహింస, సామరస్యం, ప్రేమకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందింది. మన నాయకులు రాజకీయాల్లో ఈ పాయింట్లను ప్రమాణాలుగా స్థాపించారు. బ్రిటీష్ పాలనలోనే గాంధీజీ ఈ ప్రమాణాలను రాజకీయాల్లో ముఖ్యమైన భాగంగా చేశారు. స్వాతంత్ర్యానంతరం పార్లమెంటరీ రంగంలో అధికార పక్షం, ప్రతిపక్షాల మధ్య గౌరవప్రదమైన ఒప్పందాలు కుదిరిన చరిత్ర ఉంది. ఇది భారత ప్రజాస్వామ్య ప్రతిష్ఠను పెంచడానికి పనిచేసింది. ఈ విషయంపై కోట్లాది మంది కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇలాంటి విద్వేషపూరిత శక్తుల వల్ల జాతిపిత మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు త్యాగం చేయాల్సి వచ్చింది. అధికార పార్టీ ఈ రాజకీయ ప్రవర్తన ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత దారుణమైన ఉదాహరణ. మీ నేతలు వెంటనే హింసాత్మక ప్రకటనలు చేయడం మానేయాలి. ఇందుకు మీరు తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాను' అని లేఖలో పేర్కొన్నారు.

రైతు అనుకూల విధానాలు అమలు చేశాం

వంద రోజుల పాలనపై అమిత్ షా

న్యూదిల్లీ : వ్యవసాయ ఉత్పాదకత, ఎగుమతులను మెరుగుపరచడంపై దృష్టి సారించి కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజులలో ప్రభుత్వం అనేక రైతు అనుకూల విధానాలను అమలు చేసిందని కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం తెలిపారు. మోదీ 3.0 పాలన 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 14 రంగాల్లో రూ.15 లక్షల కోట్ల విలువైన విధానాలను అమలు చేసిందన్నారు. వ్యవసాయ ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్టార్టప్‌లు, గ్రామీణ సంస్థలకు మద్దతు ఇవ్వడానికి మోదీ ప్రభుత్వం వ్యవసాయ నిధిని ప్రారంభించిందని తెలిపారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి, రైతులకు మద్దతు ఇవ్వడానికి వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని విస్తరించామని, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడానికి ఏడు పథకాలకు రూ.14,200 కోట్లు కేటాయించామని మంత్రి చెప్పారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం కింద 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్లు పంపిణీ చేయడంతో సహా వ్యవసాయ రంగంలో కీలక విజయాలను మంత్రి చెప్పుకొచ్చారు. 'ప్రధాని మోదీ మూడవసారి అధికారం చేపట్టిన తర్వాత తీసుకున్న మొదటి నిర్ణయం ప్రధాన మంత్రి కిసాన్ నిధి 17వ విడత కింద 9.3 కోట్ల మంది రైతులకు రూ.20 వేల కోట్లు పంపిణీ చేయడం. ఇప్పటివరకు 12.33 కోట్ల మంది రైతులకు రూ.3 లక్షల కోట్లు పంపిణీ చేయడం జరిగింది' అని అమిత్ షా చెప్పారు. ఇది దేశ ఆహార ధాన్యాల ఉత్పత్తి, ఎగుమతులను పెంపొందించడానికి సహాయపడుతుందని, తద్వారా రైతుల జీవితాలు మెరుగుపడతాయని అన్నారు.షా మీడియా సమావేశంలో సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కూడా ఉన్నారు.

సందీప్ ఘోష్ ఫామ్ హౌస్‌లో ఈడీ సోదాలు

కోల్‌కతా: ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో ఆ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ ప్రొ.సందీప్ ఘోష్‌ను సీబీఐ అరెస్ట్ చేసి విచారిస్తోంది. ఉత్తర కోల్‌కోతలోని సందీప్ ఘోష్‌కు చెందిన ఫామ్‌హౌస్‌లో ఈడీ అధికారులు మంగళవారం తెల్లవారుజామున సోదాలు నిర్వహించారు. అలాగే అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే సుదీప్తి రాయ్ నర్సింగ్ హోమ్‌లోనూ ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ రెండు ప్రదేశాల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు నిర్వహించింది. శ్రీరామ్‌పూర్ ఎమ్మెల్యే సుదీప్తి రాయ్... పశ్చిమ బెంగాల్ హెల్త్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి పేషెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్‌గా సుదీప్తి రాయ్ వ్యవహరించారు. దీంతో ఆయనపై ఆరోపణలు వెల్లువెత్తాయి. గతంలో రాయ్ నివాసంలో సీబీఐ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. సందీప్ ఘోష్ నివాసం, ఆసుపత్రికి వైద్య పరికరాలు సరఫరా చేసిన సంస్థతోపాటు మందులు విక్రయించిన సంస్థలపై ఇప్పటికే ఈడీ దాడులు నిర్వహించిన విషయం విదితమే.

ఉన్నత విద్యావంతురాలు ఆతిశీ

న్యూదిల్లీ: దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వారసురాలిగా ఆతిశీ ఎంపికయ్యారు. ఆప్ శాసనసభాపక్షంలో ఆతిశీపేరును కేజ్రీవాల్ ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. కాగా, ఆతిశీపూర్తి పేరు... ఆతిశీమార్లెనా సింగ్. 1981 జూన్ 8వ తేదీన న్యూదిల్లీలో జన్మించారు. ఆమె తల్లిదండ్రులు విజయ్ సింగ్, తృప్త వాహీ.

వీరిద్దరు యూనివర్సిటీ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. న్యూదిల్లీ పూసా రోడ్డులోని స్ప్రింగ్‌డేల్ హైస్కూల్‌లో ఆతిశీవిద్యాభ్యాసం చేశారు. 2001లో దిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుంచి చరిత్రలో ఆమె బ్యాచిలర్ డిగ్రీ అందుకున్నారు. అనంతరం ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో చేరి... చెవెనింగ్ స్కాలర్‌షిప్ అందుకున్నారు. 2003లో చరిత్రలో ఆమె ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత 2005లో రోడ్స్ స్కాలర్‌తో ఆక్స్‌ఫర్డ్‌లోని మాగ్దలెన్ కాలేజీకి ఆతిశీహాజరయ్యారు. 2013లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరడంతో ఆతిశీ రాజకీయ జీవితం ప్రారంభమైంది. పార్టీ విధి విధానాలు, రూపకల్పనలో ఆమె క్రియశీలకంగా వ్యవహరించారు. 2015లో మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో జరిగిన చారిత్రాత్మక జల సత్యాగ్రహంలో ఆతిశీపాల్గొన్నారు. ఈ దీక్షతో సంబంధమున్న ఆప్ నాయకుడు, కార్యకర్త అలోక్ అగర్వాల్‌కు ఆమె సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 2019 ఎన్నికల్లో తూర్పు దిల్లీ లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా ఆతిశీ పోటీచేసి...బీజేపీ అభ్యర్థి గౌతం గంభీర్ చేతిలో ఓటమి పాలయ్యారు. 2020లో దిల్లీ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో దక్షిణ ఢిల్లీలోని కల్‌కాజీ నియోజకవర్గం నుంచి ఆప్ అభ్యర్థిగా ఆమె రంగంలోకి దిగారు. బీజేపీ అభ్యర్థి ధర్మంబిర్ సింగ్‌పై ఆతిశీ ఘన విజయం సాధించారు. కేజ్రీవాల్ కేబినెట్‌లో అత్యంత కీలకమైన 11 శాఖలు ఆతిశీచేతిలోనే ఉన్నాయి. విద్యా శాఖ మంత్రిగా దేశ రాజధాని దిల్లీలోని ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చడంలో ఆమె కీలకంగా వ్యవహరించారు. దిల్లీలో మంచి నీటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు జలవనరులశాఖ మంత్రిగా ఆతిశీ... నీటి విడుదల కోసం కేంద్రంలోని బీజేపీతోనే కాకుండా... పక్కనున్న హర్యానాలోని బీజేపీ ప్రభుత్వంతో పెద్ద యుద్ధమే చేశారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో సీఎం కేజ్రీవాల్, డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా అరెస్టయిన నాటి నుంచి ఆమ్ ఆద్మీ పార్టీ తరపున ఆతిశీ అత్యంత కీలకంగా వ్యవహరించారు.

పడవ యజమానులపై చర్యలు

నారాయణ డిమాండ్

ప్రకాశం బ్యారేజీని పరిశీలించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర-విజయవాడ: ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న పడవల యజమానులను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. పడవలు తమవేనంటూ బినామీలు ముందుక వస్తున్నారని, అసలైన యజమానులపైనే చర్య తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. విజయవాడలో ప్రకాశం బ్యారేజీ గేట్లను భారీ పడవలు ఢీకొన్న ఘటనా ప్రాంతాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సారధ్యంలోని సీపీఐ బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా నారాయణ విలేకరులతో మాట్లాడుతూ 150 టన్నుల ఇసుక తీసుకెళ్లగలిగిన దాదాపు 60 టన్నుల బరువు ఉన్న ఐదు పడవలు బ్యారేజీ గేట్లను ఢీకొన్నాయని చెప్పారు. ఒకటి కొట్టుకు పోగా మరొకటి నీటి అడుగున ఉందని, మూడు పైకి కనబడుతున్నాయని చెప్పారు. ఈ పడవలు ఎవరివో గుర్తించి... నిజమైన దోషులను విజిలెన్సు అధికారులు పట్టుకోవాలని డిమాండ్ చేశారు. పడవలు తమవంటూ ఎస్సీ, బీసీలు వస్తున్నారని, వారు కేవలం బినామీలు మాత్రమేనన్నారు. పడవలకు ఉన్న రంగు ఆధారంగా అవి కచ్చితంగా వైసీపీకి చెందిన వారివిగా అర్థమవుతుందన్నారు. బోట్లు ఢీకొడితే బ్యారేజీకి ఏమవుతుందంటూ కొంతమంది వితండవాదం చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచిది కాదన్నారు. ఈ ఘటన వెనుక మాఫీయా ఉందని నారాయణ చెప్పారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సహజంగా కరువు వస్తుందని, ఇప్పుడు అతివృష్టి వచ్చి ఇళ్లు, పంటలు కొట్టుకుపోయాయని అన్నారు. తమ బృందం కొల్లేరును పరిశీలించిందన్నారు. ఆ ప్రాంతంలో పై నుంచి ఏలూరు కాల్వ, కింద నుంచి బుడమేరు ప్రవహించేలా బ్రిటీష్ వాళ్లు అక్విడెట్టు నిర్మించారని చెప్పారు. ఆ నిర్మాణం నేటి అవసరాలకు సరిపోదన్నారు. వంతెన ఎత్తు, వెడల్పు పెంచాలని సూచించారు. యుద్ధ ప్రాతిదికన నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ వరదలు వచ్చిన సందర్భంగా విజయవాడ నగరంలో ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు పది రోజులు తిరిగి అన్ని సౌకర్యాలు కల్పించారని, మంచి ప్రచారం కూడా లభించిందన్నారు. గ్రామాల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు ఎవరూ రాలేదని, సహాయం అందించలేదని ప్రజలు తమ వద్ద వాపోయారని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి రెండు రోజుల పాటు పర్యటించి... అక్కడ పరిస్థితిని తెలుసుకున్నారని చెప్పారు. పంటనష్టంపై ఇంకా ఎన్యూమరేషన్ పూర్తి చేయలేదన్నారు. కొల్లేరు ప్రాంతాన్ని కోటీశ్వర్లు, చేపలు, రొయ్యల వ్యాపారులు ఆక్రమించారని చెప్పారు. కొల్లేరు ఆక్రమణలకు సంబంధించి త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలవనున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఓబులేసు, అక్కినేని వనజ, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య, కృష్ణా జిల్లా కార్యదర్శి టి.తాతయ్య, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు బుట్టి రాయప్ప, తాడి పైడియ్య, కొట్టు రమణారావు, మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు శ్యామల, కార్యదర్శి యామిని తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌పై బీజేపీ అనుచిత వ్యాఖ్యలు తగదు : షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీపై బీజేపీ నేతలు దివాలాకోరు వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల ఖండించారు. ఈ వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేస్తూ, రాహుల్ గాంధీ కశ్మీర్ నుంచి ఇటు కన్యాకుమారి వరకు 140 కోట్ల మంది గుండెల్లో ప్రేమ, స్నేహభావం, ఐకమత్య రాగం నింపుతుంటే, ఆ తుపాన్‌ను తట్టుకోలేక, పిరికిపందల్లా, ఇలాంటి దివాలాకోరు మాటలు మాట్లాడటానికి బీజేపీ వాళ్లు సిగ్గుపడాలన్నారు. నాటి ఇందిరమ్మ నుంచి, రాజీవ్ గాంధీ వరకు ఆ కుటుంబం మొత్తం దేశం కోసం ఆత్మ త్యాగాలు చేసినవారేనని, బలిదానాలు రాహుల్ రక్తంలోనే ఉందన్నారు. బ్రిటీషు వారి నుంచి నేటి ఫాసిస్టు శక్తులపై ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. అసలు తీవ్రవాదుల లక్షణాలను అణువణువునా నింపుకుని, మనుషుల మధ్య చిచ్చు పెట్టి, చలికాచుకునే నీచ సంస్కృతి బీజేపీది కాదా? అని ప్రశ్నించారు. ఇలాంటి విచ్ఛిన్నకర శక్తులపై పోరాడుతున్న రాహుల్‌పై కత్తికట్టేందుకు బీజేపీ నేతలు ప్రయత్నిస్తున్నారని, ఇకపై మీ పాచికలు పారబోవని పేర్కొన్నారు. దేశం మొత్తం రాహుల్‌ని ప్రేమిస్తోందని, ఆయన నుంచి స్ఫూర్తి తీసుకుంటోందన్నారు. రాహుల్ గాంధీపై చేసిన దారుణ వ్యాఖ్యలను షర్మిల తీవ్రంగా ఖండించారు.

ఇక ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత, భూ రక్షిత పథకాన్ని ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్టుగా మార్చారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆర్.పి.సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ జగనన్న శాశ్వత, భూ రక్షిత పథకంగా అమలు చేశారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దీన్ని పేరును మార్చారు. ఇప్పటికే గత ప్రభుత్వ హయాంలోని చాలా పథకాలకు పేర్లు మార్పు చేశారు. ఇప్పుడు అందులో భాగంగా జగనన్న శాశ్వత, భూ రక్షిత పథకాన్ని ఆంధ్ర ప్రదేశ్ రీ సర్వేగా మార్పు చేశారు.

బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఫీజు ఖరారు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నరసారావుపేటలోని బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) కళాశాలలో ప్రతి ఏడాది రూ.15 వేలుగా నిర్ధారిస్తూ ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్ల బీఈడీ (స్పెషల్) ఎడ్యుకేషన్ కోర్సులో ప్రతి ఏటా రూ.15 వేల చొప్పున ఫీజులను నిర్ధారించారు.

వైసీపీది అసత్య ప్రచారం: మంత్రి లోకేశ్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అసత్య ప్రచారాలు చేయటం తగదని మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. విజయవాడలో మంత్రి సంధ్యారాణి నివాసంలో జరిగిన పుట్టిన రోజు వేడుకలు తిరుమలలో జరిగినట్లు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) లో పోస్టు చేశారు. 'ఫేక్ జగన్ నువ్వు మారవు... నీ ఫేక్ మూకలు అస్సలు మారరు... ఫేక్ చేసి చేసి 151 నుంచి 11కి వచ్చావు... ఏడుకొండలపై నీ విష రాజకీయాలు వాడొద్దు. ఒక్క సీటు కూడా లేకుండా పోతావ్' అని పేర్కొన్నారు.

ఇన్‌సర్వీస్ రిజర్వేషన్‌పై నేడు చర్చలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పీజీ వైద్యవిద్యలో ఇన్‌సర్వీస్ రిజర్వేషన్ విషయానికి సంబంధించి చర్చించడానికి రావాల్సిందిగా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పీహెచ్‌సీ డాక్టర్ల సంఘం ప్రతినిధుల్ని ఆహ్వానించింది. పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధ్వర్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ సి.హరికిరణ్, డీఎంఈ డాక్టర్ నరసింహం, డాక్టర్ ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రాధికారెడ్డి చర్చిస్తారు. ఈ మేరకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సి.హరికిరణ్ సంఘం ప్రతినిధులకు మంగళవారం సమాచారాన్ని అందజేశారు. ఈ సమావేశానికి ముందు ఈ విద్యా సంవత్సరంలో జాతీయ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన పీజీనీట్ పరీక్షలో అర్హత పొందిన ప్రభుత్వ ఎంబీబీఎస్ వైద్యుల వివరాలను తెలియజేయాలని సంఘ ప్రతినిధులను కమిషనర్ కోరారు. ఇదే విషయంపై కృష్ణబాబు ఇటీవల పీహెచ్‌సీల డాక్టర్ల సంఘం ప్రతినిధులతో ఒక విడత భేటీ నిర్వహించారు. ఈ ఏడాది ఇన్‌సర్వీస్ రిజర్వేషన్ కింద పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొంది పీజీ పూర్తి చేసుకుని, 2027లో వీరంతా తిరిగి ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధుల్లో చేరాల్సి ఉందన్నారు. ఆ సమయానికి వివిధ స్పెషలిస్ట్ విభాగాల్లో లభ్యం కానున్న ఖాళీలపై మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు మదింపు చేస్తున్నారని, ఈ ఏడాది పీజీ నీట్ పరీక్షలో అర్హత పొందినవారి సమాచారం మేరకు పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించనుంది.

'కోస్తా సమయం' ఎడిటర్ వీరభద్రరావు మృతి

విశాలాంధ్ర-కాకినాడ: 'కోస్తా సమయం' దినపత్రిక సంపాదకుడు పడాల వీరభద్రరావు మృతిచెందారు. తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం కేంద్రంగా ఈ పత్రిక వెలువడుతోంది. కొంత కాలంగా అనారోగ్యంగా ఉన్న వీరభద్రరావును వారం క్రితం రాజమహేంద్రవరం నుంచి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి చికిత్స పొందుతూ ఆయన మంగళవారం రాత్రి 7 గంటలకు తుదిశ్వాస విడిచారు. పడాల వీరభద్రరావు మృతి తీరని లోటని సహచరులు, బంధు మిత్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పడాల వీరభద్రరావు మరణం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ నాయకులు సంతాపం ప్రకటించారు. పడాల వీరభద్రరావు... అల్లూరి సీతారామరాజు జాతీయ యువజన సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. అల్లూరి విగ్రహాలు ప్రతిష్టించే కార్యక్రమాలు అనేకం చేపట్టారు.

పెనుగొండ సంతాపం: పడాల వీరభద్రరావు మృతి అరసానికే కాకుండా అభ్యుదయ ఉద్యమాలకు తీవ్ర నష్టమని అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీ నారాయణ పేర్కొన్నారు. అరసం జిల్లా శాఖల ఏర్పాటులో ఆయన ఎంతో కృషి చేశారన్నారు. పడాల మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కన్నతల్లి ఆస్తినే కొట్టేశారు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కడుపున పుట్టిన కొడుకులే తనను దారుణంగా మోసంచేసి ఉన్న భూమిని లాక్కున్నారని...ఒక్క ముద్ద అన్నం కూడా పెట్టడం లేదని ఓ వృద్ధురాలు వాపోయారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడు గ్రామానికి చెందిన ముక్కపాటి రాజ్యం అనే వృద్ధురాలు మంగళవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి తన దుస్థితిని వివరించారు. కన్న కొడుకులే కనికరంలేని కాలాంతకులుగా మారి తనకు అన్నం పెట్టడంలేదని...తన పేరు మీద ఉన్న పొలాన్ని ఫోర్జరీ సంతకాలతో కాజేసి...తననే కొట్టడానికి వస్తున్నారని తెలిపారు. అన్నా క్యాంటీన్‌లో అన్నం తిని బతుకుతున్నానన్నారు. దీనిపై ఎన్నోసార్లు కలెక్టర్, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆమె వాపోయారు. తనకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, పీలా గోవింద్‌లు ఆమె నుండి అర్జీని స్వీకరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే టీడీపీకి ఓటు వేశామన్న కక్షతో ఎస్సీనైన తనపై అత్యాచారం చేసి చంపాలని చూశారని, ఆ ఘటనలో తనకు కాలు చేయి విరిగిందని నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం మండలం తూర్పు పోలినేనిపాలెం గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి తనకు న్యాయం చేయాలని ఆమె నేతలను వేడుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తోన్న గెస్ట్ లెక్చరర్స్ వంద మందికిపైగా వచ్చి తమ సమస్యని పరిష్కరించాలని కోరారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కొండూరు గ్రామ రైతులు, రైతు కూలీలు డొంక రోడ్డు సమస్యపై వినతి పత్రాన్ని అందించారు. ఇలా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన వారు వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందజేయగా... సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారం చేస్తామని నేతలు హామీ ఇచ్చారు.

ఊహకందని నష్టం

- వందల ఎకరాల భూమి కనుమరుగు
- కన్నెత్తి చూడని అధికారులు
- గిరిపుత్రులను ఆదుకోవాలి
- జేవీ సత్యనారాయణ మూర్తి డిమాండ్

విశాలాంధ్ర-జీకే వీధి: అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలంలో ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి అతలాకుతలమైన గిరిపుత్రులను భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ మూర్తి నాయకత్వంలోని ప్రతినిధి బృందం రెండో రోజు కూడా పరామర్శించింది. మండలంలోని దారకొండ పంచాయతీ పరిధిలో తీవ్రంగా నష్టపోయిన చిన్నగంగవరం, పెద్దగంగవరం, పెట్రాయి, నిమ్మచెట్టు, కొంగపాకలు, మూలసల వీధి తదితర గ్రామాల్లో సీపీఐ బృందం... భారీ వర్షం, ఆకస్మిక వరదల ధాటికి జరిగిన నష్టాన్ని పరిశీలించింది. మండలంలోని ఆరు పంచాయతీల్లో భారీ వర్షాలకు గెడ్డలు పొంగి వరద ప్రవాహం కారణంగా తీవ్రమైన నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబాలు ఈ సందర్భంగా సీపీఐ బృందానికి వివరించాయి. వారం రోజులయినా ప్రభుత్వ పెద్దల్లో కనీస చలనం లేదని, గెడ్డల్లోని వరద నీరు పొంగి పొర్లి అర్ధరాత్రి వేళలో నివాసం ఉంటున్న గుడిసెల్లోకి చేరి మొత్తం కొట్టుకుపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువులు కూడా లేని పరిస్థితి నెలకొందని వారు తాము ఎదురుకొంటున్న కష్టాలను వివరించారు. రెవెన్యూ యంత్రాంగం సరిగా స్పందించడం లేదని, వందలాది ఎకరాల్లో సాగు చేసుకుంటున్న పంట వరదలో కొట్టుకుపోయిందని కన్నీటి పర్యంతమయ్యారు. కట్టు బట్టలు తప్ప, తినడానికి తిండి గింజలు కూడా మిగలలేదని తెలిపారు. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ జీకే వీధి మండలంలో వర్షాలు, వరదలకు భారీ నష్టం జరిగి వారం రోజులు దాటినా అధికారులు ఇటువైపు చూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకరిద్దరు అధికారులు వచ్చినా గిరిజనులకు కనీస సాయం చేయలేదని అన్నారు. వందల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, నివాసాలతో పాటు పదుల సంఖ్యలో పశువులు వరదలో కొట్టుకుపోయినట్లు తెలిపారు. అంచనాలకు అందని నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొండ ప్రాంతం కావడంతో నష్టం అంచనా అంత సులభం కాదని, డ్రోన్‌ల ద్వారా జీపీఎస్ సర్వే చేసి పంట నష్టం అంచనాలు తయారు చేయాలని ఆయన సూచించారు. ప్రతి కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. వ్యవసాయ భూముల ఆనవాళ్లు లేకుండా పోయాయని, రెవెన్యూ యంత్రాంగం మాత్రం పట్టా భూములకే నష్టపరిహారం ఇస్తామని చెప్పడం దారుణమని విమర్శించారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న ఆర్ఓఆర్ఎఫ్ పట్టాలతో పాటు అన్ని రకాల భూములకు పంట నష్టం చెల్లించాలని, వందలాది ఎకరాల్లో ఇసుక మేటలు వేసిందని, ప్రభుత్వమే ఆ భూములను సాగుకు అనుకూలంగా తయారు చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగుకు అనుకూలం కాకపోతే మరోచోట ప్రత్యామ్నాయ భూమిని కేటాయించాలని కోరారు. ఉపాధి కోల్పోయిన వారికి గ్రామీణ ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ పరిశీలనా బృందంలో ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు అత్తిలి విమల, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకర విష్ణు మూర్తి, కిల్లో భగవాన్, ఆళ్ల గోవిందు, కిల్లో గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

బాంబే ఐఐటీకి 'మోతీలాల్ ఓస్వాల్' రూ.130 కోట్ల విరాళం

ముంబై: ప్రఖ్యాత సాంకేతిక విద్యా సంస్థ బాంబే ఐఐటీకి ప్రముఖ ఫండ్ మేనేజ్‌మెంట్ సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్ భారీ విరాళం అందజేసింది. రూ.130 కోట్ల విరాళం చెక్కును ఐఐటీ బాంబే ప్రతినిధులకు ఇచ్చింది. ఈ విద్యాసంస్థలో ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రీసెర్చ్‌ను మరింతగా మెరుగుపరిచేందుకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొంది. దేశంలోని విద్యాసంస్థలకు ఇచ్చిన అతి పెద్ద కార్పొరేట్ విరాళాల్లో ఇది ఒకటి. అత్యాధునిక విద్యాసంబంధిత మౌలిక వసతుల ఏర్పాటు, ఫైనాన్షియల్ మార్కెట్‌లో వినూత్న కార్యక్రమాల ఆవిష్కరణే లక్ష్యంగా ఈ సాయం అందించింది. రూ.4000 కోట్ల ఈక్విటీల్లో 10 శాతాన్ని దాతృత్వం కోసం ఇస్తామని ప్రతిజ్ఞ చేసిన మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షిల్ సర్వీసెస్ లిమిటెడ్... ఈ మొత్తాన్ని అందజేయడం విశేషం. ఐఐటీ బాంబేలో మోతీలాల్ ఓస్వాల్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటుకు ఇది తోడ్పడనుంది. 1-1.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక లేబొరేటరీలు, రీసెర్చ్ సెంటర్లతో ఈ విద్యా కేంద్రం ఏర్పాటుకు ఈ సాయం ఉపయోగపడనుంది. తమ విద్యా సంస్థకు పెద్దమొత్తంలో విరాళం అందించిన మోతీలాల్ ఓస్వాల్ ఫౌండేషన్‌కు ఐఐటీ బాంబే డైరెక్టర్ ప్రొఫెసర్ శిరీష్ కెదారె కృతజ్ఞతలు తెలిపారు.

మహిళా డాక్టర్లకు 'నైట్ డ్యూటీ' వద్దని

మీరెలా చెబుతారు?

- మమత సర్కారుపై సుప్రీం మండిపాటు
- భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యతంటూ చురక

న్యూఢిల్లీ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బందిని రాత్రిపూట విధుల్లో నియమించొద్దని పశ్చిమ్ బెంగాల్ ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ తీవ్రంగా మండిపడ్డారు. భద్రతను కల్పించడం ప్రభుత్వ విధి అని వ్యాఖ్యానించారు. ఈ ఉత్తర్వులను సవరించాలని బెంగాల్ సర్కారుకు సూచించారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతా ఆర్జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటన మంగళవారం సుప్రీంకోర్టు మరోసారి విచారణ జరిపింది. ఈ సందర్భంగా మహిళా వైద్యులకు నైట్ డ్యూటీలు నిషేధిస్తూ మమతా బెనర్జీ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర విమర్శలు గుప్పించింది. 'మహిళలు రాత్రిపూట విధుల్లో ఉండొద్దని మీరు ఎలా చెబుతారు? మహిళా వైద్యులపై ఎందుకు పరిమితులు? వాళ్లు మినహాయింపులు కోరుకోవడం లేదు... నైట్ డ్యూటీలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు' అని సీజేఐ తీవ్ర స్వరంతో మాట్లాడారు. బెంగాల్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌ను ఉద్దేశించి 'మిస్టర్ సిబల్ మీరు దానిని చూడాలి... దానికి సమాధానం తప్పక భద్రత ఇవ్వాలి. పశ్చిమ బెంగాల్ నోటిఫికేషన్‌ను సవరించాలి... భద్రత కల్పించడం మీ కర్తవ్యం, మహిళలు రాత్రిపూట పని చేయలేరని మీరు చెప్పలేరు... పైలట్లు, సైనికులు మొదలైన వారంతా రాత్రి పని చేస్తారు' అని పేర్కొన్నారు. మహిళా వైద్యులు రాత్రిపూట విధులు నిర్వర్తించేందుకు అనువైన వాతావరణం లేకుంటే వారి కెరీర్‌కు విఘాతం కలుగుతుందని సీజేఐ అన్నారు. దీనికి సిబల్ స్పందిస్తూ మీరు లేవనెత్తిన అంశాన్ని తొలగిస్తామని హామీ ఇచ్చారు.

సీబీఐ నిద్రపోవట్లేదు...

ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) నిద్ర పోవట్లేదని, నిజాన్ని వెలికితీసేందుకు వారికి కొంత సమయం ఇవ్వాలని ఈసందర్భంగా న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అలాగే బాధితురాలి ఫొటో, పేరును వికీపీడియా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. సుప్రీంకోర్టు గత ఆదేశాల మేరకు ఈ కేసు దర్యాప్తు పురోగతిపై నివేదికను సీబీఐ తాజాగా సమర్పించింది. దానిలో పేర్కొన్న విషయాలు తీవ్ర దిగ్భ్రాంతి కలిగించాయని న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు గుర్తించిన వివరాలను బయటపెట్టడం వల్ల దర్యాప్తుపై ప్రభావం పడొచ్చని పేర్కొంది. వాస్తవాలను వెలికితీయడం దర్యాప్తు లక్ష్యమని వెల్లడించింది. ప్రిన్సిపల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్(ఎస్‌హెచ్‌ఓ)ను అరెస్టు చేశారని, దర్యాప్తు పూర్తయ్యేవరకు వేచిచూద్దామని తెలిపింది. ఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత సీబీఐకి కేసు అప్పగించడం వల్ల అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, కేసులో పురోగతి పరిమితంగా ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. అలాగే ఆర్జీ కర్‌లో ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయంటూ వచ్చిన ఆరోపణలపై నివేదిక సమర్పించాలని ప్రస్తుత విచారణ సందర్భంగా సీబీఐని కోర్టు ఆదేశించింది. 'ఏ రూపంలో కూడా బాధితురాలి వివరాలు బయటకు వెల్లడించకూడదు. ఈ ఘటనలో ఆమెకు సంబంధించి ఫొటో, ఆమె గుర్తింపు వెల్లడిచేసే ఏ వివరాన్నైనా సరే వికీపీడియా వెంటనే తొలగించాలి' అని కోర్టు ఆదేశించింది. కొన్ని మీడియా సంస్థలు బాధితురాలి ఫొటో, పేరును ప్రచురించడంపై గత విచారణలోనూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాగా నిరసన తెలుపుతున్న వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని బెంగాల్ ప్రభుత్వం కోర్టుకు వెల్లడించింది.

న్యాయవాదులకు భద్రత

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న మహిళా న్యాయవాదులకు భద్రత కల్పించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. తన ఛాంబర్‌లో మహిళ న్యాయవాదులకు అత్యాచార బెదిరింపులు వస్తున్నాయని, వారిపై యాసిడ్ పోస్తామని, అత్యాచారం చేస్తామంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో వికృత పోస్టులు పెడుతున్నారని కపిల్ సిబల్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వ్యవహారంపై స్పందించిన ధర్మాసనం, మహిళా న్యాయవాదుల భద్రతకు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. హత్యాచారం కేసులో ప్రత్యక్ష ప్రసారం నిలిపివేయాలన్న సిబల్ అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ కేసు విచారణను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు పేర్కొంది.

వరద బాధితులకు ఎస్వీ యూనివర్సిటీ భారీ విరాళం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి విరాళాలు అందజేశారు. ఎస్వీ యూనివర్సిటీ ఇంఛార్జ్ వీసీ సీహెచ్.అప్పారావు, రిజిస్ట్రార్ ఎమ్.భూపతి నాయుడు నేతృత్వంలో బోధన, బోధనేతర సిబ్బంది, ఉపాధ్యాయ, శాశ్వత ఉద్యోగులు, టైం స్కేల్ ఉద్యోగులు, ఎన్ఎమ్ఆర్ ఉద్యోగులు, టీచింగ్ అసిస్టెంట్స్, పెన్షనర్లు కలిపి రూ.47,46,380లకు చెక్కును మంత్రి లోకేశ్‌కు అందించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ఫ్లెక్స్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రూ.5 లక్షలు, అమలాపురానికి చెందిన చెరుకూరి రామచంద్రరావు రూ.5 లక్షలు, హైదరాబాద్‌కు చెందిన సునీత డిజైనర్ బొటిక్ నిర్వాహకురాలు ఎమ్.సునీత రూ.2,35,000, గుంటూరుకు చెందిన శ్రీరంగ మెడికల్ ఏజెన్సీ నిర్వాహకులు జి.రామస్వామి రూ.1,11,111, హైదరాబాద్ కు చెందిన పొట్లూరి సాయి నాగార్జున రూ.50 వేలు, విజయవాడ నిడమానూరుకు చెందిన లాల్‌బీ రూ.55,555 విరాళాలు అందజేశారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన వారందరికీ మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

అణు విద్యుత్ ఉత్పత్తికి 'అశ్విని'

ఆమోదించిన కేంద్రం

న్యూఢిల్లీ: భారత్‌లో అణు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నెలకొల్పేందుకు 'అశ్విని'కి కేంద్ర ఆమోదం లభించింది. ఎన్‌పీసీఐఎల్-ఎన్‌టీపీసీ జేవీ సంయుక్త అధ్వర్యంలో ఈ పనిచేస్తుంది. అణు విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేలా యాజమాన్య బదిలీ జరుగనుంది. నిర్దేశించిన పరిధికి మించి పెట్టుబడి పెట్టేలా ఎన్‌పీసీఐఎల్, ఎన్‌టీపీసీకి మినహాయింపులను కేంద్రప్రభుత్వం ఇవ్వనుంది. అణుశక్తి విద్యుత్ నిగమ్ లిమిటెడ్ (అశ్విని)ని కేంద్రం ఆమోదించడంతో మహి బాన్సవార రాజస్థాన్ అటామిక పవర్ ప్రాజెక్ట్ (ఎంబీఆర్ఏపీపీ)ను ఎన్‌పీసీఐఎల్ నుంచి ఇది టేక్ ఓవర్ చేస్తుంది.అణు విద్యుత్‌ను తయారీ, ప్లాంట్ల నిర్వహణను న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐఎల్), ఎన్‌టీపీసీ లిమిటెడ్ సంయుక్తంగా చేపడతాయి. ఎంబీఆర్ఏపీపీ ప్రాజెక్టు విలువ రూ.44,800 కోట్లు. ఇది దేశీయ ప్రజరైజ్డ్ హెవీ-మహిళా రియాక్టర్ (పీహెచ్‌డబ్ల్యూఆర్) సాంకేతికను వినియోగిస్తుంది. దీని సామర్థ్యం 2800 ఎండబ్ల్యూ2. 'అశ్విని'నిలో ఎన్‌పీసీఐఎల్, ఎన్‌టీపీసీకి 51:49 చొప్పున భాగస్వామ్యం ఉంది.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

కుమారి నందకు మొదటి బహుమతి

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 15 వరకు అమలాపురంలో జరిగిన రెండు రోజుల 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో న్యాయవిభాగం అతిథి అధ్యాపకురాలిగా పనిచేస్తున్న పరుచూరు కుమారి నంద మహిళల సీనియర్ కేటగిరి 76 కేజీల విభాగంలో మొదటి బహుమతి సాధించింది. బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌లో మొదటి బహుమతి కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు ఆమెకు అభినందనలు తెలిపారు. కుమారి నంద భవిష్యత్తులో జరగబోయే నేషనల్ ఈవెంట్‌లో కూడా ఇలాగే రాణించి మరిన్ని పతకాలు సాధించాలని గంగాధరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయవిభాగపు అతిథి ప్రొఫెసర్ ఎల్.జయశ్రీ మాట్లాడుతూ వర్సిటీ ఉద్యోగులు, విద్యార్థులు క్రీడ, సాంస్కృతిక పోటీలలో పాల్గొంటూ అటు విశ్వవిద్యాలయానికి ఇటు రాష్ట్రానికి మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ సురేశ్ చెన్నం, డాక్టర్ పి.శివరాం, డాక్టర్ సతీశ్ కుమార్, డాక్టర్ ఎన్.రాధిక, ఎస్.చంద్రశేఖర్, చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.